# ఇంకెన్నాళ్ళు ఇన్‌ఛార్జి కార్యదర్శుల పాలన!

**- తిరుపతిరూరల్లో ...15 గ్రామ పంచాయతీలకు ఇన్‌చార్జి కార్యదర్శులే**

**- అభివృద్ధి పనులు నిలిచి....ఇబ్బందుల్లో గ్రామ ప్రజలు**




తిరుపతిరూరల్, అక్టోబర్26 ప్రభాతవార్త: రాష్ట్రంలోని మేజర్ మండలాల్లో తిరుపతి రూరల్ మండలం కూడా ఒకటి. 34 గ్రామ పంచాయతీలు దాదాపు 2లక్షల జనాభా ఉన్న తిరుపతిరూరల్ మండలంలో 15 పంచాయతీలలో ఇన్‌చార్జుల పాలన నడుస్తోంది. ఒక్కో పంచాయతీ కార్యదర్శికి రెండు, మూడు పంచాయతీలకు ఇన్‌చార్జిలుగా నియమించారు. ఫలితంగా ఆయా గ్రామ పంచాయతీలలో అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. బిల్లులు చెల్లింపులు, పబ్లిక్ సేవల నిర్వహణ అలస్యమవుతుండటంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. అవిలాల, బ్రాహ్మణపట్టు, చెర్లోపల్లి, దుర్గసముద్రం, గాంధీపురం, మల్లంగుంట, పద్మావతిపురం, పెరుమాళ్ళపల్లి, పుదిపట్ల, రణధీరపురం, సాయినగర్, సప్తగిరి కాలనీ, తనపల్లి, తిరుమలనగర్, వేదాంతపురం గ్రామ పంచాయతీలకు ఇన్‌చార్జి కార్యదర్శులు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

**బిల్లులు పెండింగ్, పబ్లిక్ సేవలు కుదేలు**

పంచాయతీ సచివాలయ వ్యవస్థ తెచ్చిన పారదర్శకత ఇప్పుడు ఇన్‌చార్జి వ్యవస్థలో చిగురుటాకులా కరుగుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయా పంచాయతీలలో రెగ్యులర్ కార్యధర్శుల లేకపోవడంతో అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు నెలలు తరబడి పెండింగ్‌లో ఉన్నాయి. కొన్ని గ్రామ పంచాయతీలలో పంచాయతీ కార్యధర్శి ఎవరో తెలియక తికమకపడుతున్నారు.

**శానిటేషన్, జనన, మరణ ధృవ పత్రాలు జారీలో జాప్యం**

గ్రామ పంచాయతీలలో శుభ్రత పనులు సక్రమంగా కొనసాగడం లేదు. శానిటేషన్ బిల్లులు చెల్లించడంలోను సిబ్బందికి నెలవారీ జీతాలు సక్రమంగా చెల్లించకపోవడంతో శానిటేషన్ పనులు ఎక్కడికక్కడే నిలిచిపోతున్నాయి. జనన, మరణ ధృవపత్రాలు జారీ విషయం లోను, పౌర సేవలు సమస్యలు నెలకున్నాయి. సమస్యలు చెప్పుకునే అధికారి లేక... ఇన్‌చార్జిలు ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజల మండిపడుతున్నారు.

**వాపోతున్న సర్పంచ్‌లు**

అభివృద్ధి పనులు పూర్తిచేసినా...ఆ బిల్లులు ఆమోదం కోసం నెలలు తరబడి వేచి చూస్తున్నామని ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు వాపోతున్నారు. ఇన్‌చార్జి కార్యధర్శులు మరో రెండు పంచాయతీల బాధ్యతలు కూడా చూసుకోవడంతో తమ పనులు పక్కన పడుతున్నారని పలువురు సర్పంచ్‌లు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**రెగ్యులర్ కార్యదర్శులను నియామకం చేయాలని ప్రజలు డిమాండ్**

ఇంకా ఎన్నాళ్ళు ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శుల పాలనా అంటూ ప్రజలు వాపోతున్నారు. వివిధ రకాల పనుల కోసం గ్రామ పంచాయతీలకు వెళ్ళితే కార్యధర్శి లేకపోవడంతో నిట్టూర్పుతో ప్రజలు వెనుతిరుగుతున్నారు. జిల్లా పంచాయతీ అధికారి వెంటనే స్పందించి రెగ్యులర్ కార్యధర్శులను నియమించి, అభివృద్ధి పనులు సక్రమంగా నడిపించాలని కోరుతున్నారు.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# గంగమ్మకు సారె

**-జలాశయాలకు టిటిడి ఛైర్మన్ నాయుడు పూజలు**

తిరుమల,అక్టోబర్ 26ప్రభాతవార్తప్రతినిధి:

జలాశయాలకు పుష్కలంగా నీరుచేరి నిండుకుండల్లా ఉండటం శుభపరిణామమని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు తెలిపారు. తిరుమలలోని ఐదు జలాశయాలకు భారీగా నీరుచేరింది. ఆదివారం ఉదయం పాపవినాశనమ్ జలాశయంలో గంగమ్మతల్లికి పసుపు,కుంకుమ, పూలు, పండ్లు నివేదించి గంగాహారతి ఇచ్చారు.



# ముంచుకొస్తున్న మొంథా..!

**- అప్రమత్తమైన అధికార యంత్రాంగం**

**- విద్యుత్, టెలికాం, తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు**

**- రోడ్లు, చెరువులు, కాలువ గట్లు కోతకు గురైతే తక్షణం మరమ్మతులు**

**- టెలికాన్ఫరెన్స్‌లో సిఎం నారా చంద్రబాబునాయుడు ఆదేశం**

చిత్తూరు, అక్టోబర్ 26 ప్రభాతవార్త:
మొంథా తుఫాను అడ్డుకట్ట వేయడానికి జిల్లా అధికార యంత్రాంగం సంసిద్ధంగా వుండాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా 27, 28, 29 తేదీల్లో భారీ నుండి అతిభారీ వర్షాలు నమోదు కానున్నాయని, బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ఈ నెల 28వ తేదీ ఉదయం నాటికి తీవ్ర తుఫానుగా మారనుందని, ఈ సమయంలో ఎక్కడా ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరుగకుండా పక్కాగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మొంథా తుఫాను నేపథ్యంలో తీసుకోవాల్సిన ముందుజాగ్రత్తలపై సిఎం నారా చంద్రబాబునాయుడు ఆదివారం అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. తుఫానుపై ప్రజలను అప్రమత్తం చేసేలా సమాచార వ్యవస్థలు సిద్ధంగా వుండాలన్నారు.

## నేడు పాఠశాలలకు సెలవు

మొంథా తుఫాను తీవ్రత నేపథ్యంలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు సోమవారం సెలవు ప్రకటించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మీ తెలిపారు. ఈ మేరకు డిఇఒలు, మండల విద్యాశాఖ అధికారులు, హెడ్మాస్టర్లు కలెక్టర్ ఆదేశాలను పాటించి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవు ప్రకటించాల్సిందిగా ఆమె ఆదేశాలు జారీ చేశారు.

ఎస్ఎంఎస్ అలర్ట్స్, సోషల్ మీడియా, ఐవీఆర్ఎస్ కాల్స్, వాట్సాప్‌ల ద్వారా ప్రజలకు ముందస్తు హెచ్చరికలు పంపించాలన్నారు. గ్రామ నుండి రాష్ట్ర స్థాయి వరకు తుఫాన్ ప్రభావంపై సమాచారంను వేగంగా చేరవేసి నష్ట నివారణ చర్యలు పక్కాగా చేపట్టాలన్నారు. రిజర్వాయర్లు, ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో నీటి మట్టాలను నిరంతరం పర్యవేక్షించి అందుకు అనుగుణంగా కార్యాచరణ అమలు చేయాలన్నారు. విద్యుత్, టెలికాం, నీటి సరఫరా వ్యవస్థకు ఎలాంటి అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని, తుఫాను తీవ్రతను బట్టి కలెక్టర్లు తమ జిల్లాల్లో సెలవులు ప్రకటించాలని ఆదేశించారు. రహదారులు, చెరువులు, కాలువగట్లు కోతకు గురైతే తక్షణం మరమ్మతులు చేసేలా సిద్ధంగా వుండాలన్నారు. చెట్లు కూలిపోయినా, కొమ్మలు విరిగి పడినా వాటిని తొలగించడానికి అవసరమైన పవర్ సా, క్రేన్‌లు, జెసిబీలు ప్రతి సబ్ డివిజన్ స్థాయిలో సిద్ధంగా వుండాలన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో చిత్తూరు నుండి కలెక్టర్ సుమిత్‌కుమార్, డిఆర్ఓ మోహన్‌కుమార్, జిల్లా అధికారులు హాజరయ్యారు.

# వైభవంగా కొట్టె సాయి ప్రమాణ స్వీకారం

ప్రమాణస్వీకారం చేస్తున్న కొట్టె సాయి ప్రసాద్

**అంచనాలకుమించి అభిమానులు**

శ్రీకాళహస్తి,అక్టోబర్ 26 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్‌గా కొట్టె సాయిప్రసాద్ అంజంజి వినాయక ఆలయం వద్ద సంప్రదాయ బద్దంగా శాస్త్రోక్తంగా ప్రమాణ స్వీకారం చేసారు. ఆదివారం నూతనంగా నామినేట్ చేసిన బోర్డులో అత్యధిక మంది ప్రమాణస్వీకారం చేసారు. వారి చేత స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి, పర్యవేక్షణలో ఇఒ డి.బాపిరెడ్డి ప్రమాణం చేయించారు. అయితే ఆలయ ప్రదేశం చాలా తక్కువ కావటం, ఒక్కొక్క బోర్డు సభ్యునితో పదుల సంఖ్యలో బంధువులు హాజరు కావటంతో గందరగోళ పరిస్థితి చోటు చేసుకుంది. ముందుగానే పాలకులు ప్రణాళికను రూపొందించుకోవాల్సి ఉంది.కానీ అలా జరిగినట్లు లేదు. దాంతో ఆలయ సిబ్బంది పరిస్థితి అగమ్యగోచరంగామారింది. ఆదివారం తెలుగుదేశం పార్టీకి చెందిన బీలా ప్రవంతి(ఎలమంచిలి), చిన్న ప్రోలు లక్ష్మినారాయణ, (పుట్టపర్తి),కుసుమ కుమారి.కె(ఒంగోలు) కొమ్మన బోయిన రజని(చీరాల),కొప్పర్ల నాగరాజు(చింతల పూడి),కొమ్మురి విజయమ్మ (నెల్లూరుసిటి) రుద్రాక్షల కౌసలమ్మ (వెంకటగిరి), కల్మె సావిత్ర(రాజంపేట), పెనగలూరు హేమావతి(కడప),జనసేనకు చెందిన దండిరాఘవయ్య (శ్రీకాళహస్తి మండలం), పగడాల మురళి (తిరుపతి)లు ప్రమాణ స్వీకారం చేసారు. 15 మంది ప్రమాణాలుచేసారు. ఇంకా తెలం గాణకు చెందిన సభ్యుడు ఆలయ ప్రధానార్చకులు సంబంధం గురుకుల్ ప్రమాణం చేయాల్సి ఉంది. ప్రమాణ స్వీకారానికి ముఖ్యఅతిధిగా హాజరౌతారని భావించిన మంత్రి నాదేండ్ల మనోహర్ ఆలస్యంగా వచ్చారు.

**ఆగమ్యగోచరంగా మారిన ప్రమాణ స్వీకారోత్సవం:**

శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారానికి సంబంధించి కొత్తగా నియమించిన చైర్మెన్ కొట్టె సాయి ముందుగానే ఆలయాధికారులతో చర్చించి ఏర్పాట్లు చేసి ఉండాలి.కానీ ఎందుకో ఆ దిశగా ఏర్పాట్లు చేసినట్లు లేదు. దాంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.దర్శనాలకు గంటల తరబడి క్యూలైన్లలో నిరీక్షించాల్సి వచ్చింది.అంతేకాక క్యూలైన్ల నిర్వహణ గందరగోళంగా మారింది. సాధారణంగా ఆదివారం ఆలయానికి రద్దీ అధికంగా ఉంటుంది.కాబట్టి ముందు జాగ్రత్త చర్యలు తీసుకొని ఉంటే బాగుండేది. కానీ ఒక్కసారిగా అధికంగా జనం రావటంతో గందరగోళంగా మారింది.ఎట్టకేలకు ప్రమాణ స్వీకారం ముగిసింది.

తొట్టంబేడు రెవెన్యూ కార్యాలయాన్ని

# వెంటనే మార్చండి

**జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటేశ్వరన్**

తొట్టంబేడు మండల కార్యాలయ సముదాయంలో కలెక్టర్

తొట్టంబేడు,అక్టోబర్ 26 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి రెవెన్యూడివిజన్‌లో తొట్టంబేడు తహశీల్దార్ కార్యాలయాన్ని వెంటనే సమీపంలోని సమగ్ర శిశు పథక కార్యాలయంలోకి మార్చాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్ ఆదేశించారు.ఆదివారం కలెక్టర్ శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడు,శ్రీకాళహస్తి మండలాల్లో పర్యటిస్తూ తొట్టంబేడు మండల తహశీల్దార్ కార్యాలయానికి వచ్చారు.ఇక్కడ కార్యాలయ పరిస్థితిని గమనించిన కలెక్టర్ అవాక్యయ్యారు. ఇంత దయనీయ స్థితా? అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేసారు. పెచ్చులూడుతున్న భవనం, ఎటు చూసినా ఉరుస్తూ కనీసం సిబ్బంది కూర్చోటానికి కూడా వీలు లేని పరిస్థితిలో ఎలా పని చేస్తున్నారని కలెక్టర్ ఆవేదన వ్యక్తం చేసారు.ఈ భవనానికి సంబంధించి కలెక్టర్ స్థానిక తహశీల్దార్ భారతితో చర్చించారు.అయితే కొత్త భవనం ఏర్పాటు సంబంధించి విడుదల చేసిన నిధులు చాలటం లేదని వివరించారు.ఈ భవనం పూర్తిగా పడగొట్టి కొతనత భవనం నిర్మించాలని కానీ మంజూరు అవుతున్న నిధులు చాలటం లేదని వివరించారు.దాంతో ఎన్ని సార్లు టెండర్లు పిలుస్తున్నా కాంట్రాక్టర్లు ముందుకు రావటం లేదని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దాంతో స్పందించిన కలెక్టర్ వెంటనే పరిపాలనను సురక్షితం దృష్ట్యా సమీపంలోని 'సమగ్ర శిశు కేంద్ర కార్యాలయానికి' మార్చి పరిపాలన సాగించాలని సూచించారు.

**మంధా తుఫానుపై సమీక్ష:**

తొట్టంబేడు మండల కార్యాలయాల సముదానికి వచ్చి తహశీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించిన కలెక్టర్ తరువాత 'మంధా తుఫాన్'కు సంబంధించి అధికారులతో మండల పరిషత్ కార్యాలయం సమావేశం హాలులో సమీక్షించారు. తుఫానుకు సంబంధించి ప్రభుత్వం నుంచి రెడ్ అలర్ట్ ప్రకటించి ఉన్నారని అయితే దీని ప్రభావం దృష్ట్యా ఏదైనా అవాంఛనీయ సంఘటనలు సంభవిస్తే ఎలా స్పందించాలనే అంశంపై కలెక్టర్ వెంకటేశ్వరన్ సిబ్బందికి వివరించారు. ప్రతి ఒక్కరు అందుబాటులో ఉండాలని అప్రమత్తంగా ఉండాలంటూ సూచించారు.ముఖ్యంగా పరిపాలనలో తుఫాన్లు సంభవించే సమయంలో గ్రామాల్లో కార్యదర్శులు కీలకమని వారితో మండల అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో శ్రీకాళహస్తి డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి సుస్మిత, మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి.సురేంద్రనాథ్ డెప్యూటీ ఎంపిడిఓ ఓ గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.కలెక్టర్‌తో పాటు శ్రీకాళహస్తి ఆర్‌డిఓ భాను ప్రకాష్‌రెడ్డి, ట్రైనీ కలెక్టర్ సందీప్‌రఘువంశి ఉన్నారు.

# ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా చర్యలు: కలెక్టర్

వాకాడు, అక్టోబర్ 26, ప్రభాతవార్త

మొంథా తుఫాను ప్రభావంతో ఆస్తి నష్టం ప్రాణనష్టం జరగకుండా అధికార యంత్రాంగం అప్రమత్తమై ఉండాలని, ప్రజలందరూ ఇళ్లలోనే ఉండాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఆదివారం వాకాడు మండలం బాలిరెడ్డి పాలెం గ్రామంలోని స్వర్ణముఖి నది పొర్లకట్టను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మొంథా తుఫాను ప్రభావంతో భారీ నుంచి అతి భారీ వర్షాలు, 60, 70 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వస్తాయని వాతావరణ శాఖ సూచించిందని, జిల్లా వ్యాప్తంగా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు, సముద్రంలో మత్స్యకారులు బోట్లతో సముద్రంలోకి వేటకు వెళ్ళరాదని ఇప్పటికే తెలియజేశామన్నారు. జిల్లాలోని సూళ్లూరుపేట, నాయుడుపేట, కోట వాకాడు చిల్లకూరు గూడూరు ఏరియాలో ఎన్‌డిఆర్ఎఫ్ క్యాంపులు ఏర్పాటు చేస్తామన్నారు. ఇరిగేషన్ అధికారులు తుఫాను సమయంలో కాజ్ వేలు, నదులలో, దూలలో, వాగులు వంకలు లలో వరద నీరు ఎక్కువైనప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎలక్ట్రికల్ అధికారులు తుఫాన్ సమయంలో విద్యుత్తును ఆగకుండా అందించేలా ప్రత్యామ్నాయంగా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఆయన వెంట ట్రైని కలెక్టర్ సందీప్ రఘువంశి, ఇన్చార్జి ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి, తాసిల్దార్ సయ్యద్ ఇక్బాల్, ఎంపిడీవో సాయి ప్రసాద్, ఇరిగేషన్ బ్యారేజ్ ఏఈ శ్రీనివాసులు, పి ఆర్ ఏ ఈ కిరణ్, ఆర్డబ్ల్యూస్ ఏఈ సుమాంజలి, ఎం ఈ ఓ నసీం అలీ, ఏఈ ట్రాన్స్కో విజయలక్ష్మి, ఏవో దీప, మండల పార్టీ కన్వీనర్ మధుసూదన్ రెడ్డి, బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, టిడిపి ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, నాయకులు అరుణ్ కుమార్, నెల్లూరు సుధాకర్ రెడ్డి, తిరుమూరు శ్రీనివాసరెడ్డి,అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# నవంబర్ 2న ఎల్‌విఎం-3 రాకెట్ ప్రయోగం

సూళ్లూరుపేట, అక్టోబర్ 26 ప్రభాతవార్త

భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం శ్రీహరికోట నుంచి నవంబర్ 2వ తేదీన ఎల్‌విఎం-3 లాంచ్ వెహికల్ ద్వారా సిఎంఎస్-03 కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్నట్లు ఇస్రో ఆదివారం వెల్లడించింది. సిఎంఎస్-03 అనే బహుళ బ్యాండ్ కమ్యూనికేషన్ ఉపగ్రహం భారతదేశ భూభాగంతో సహా విస్తృత సముద్ర ప్రాంతాల్లో సేవలు అందిస్తుంది. సుమారు 4,400 కిలోల బరువు ఉన్న సిఎంఎస్-03 ఉపగ్రహం శ్రీహరికోట నుంచి జియో సింక్రనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి ప్రయోగించబడే అత్యంత బరువైన కమ్యూనికేషన్ ఉపగ్రహం అవుతుంది. గతంలో ఎల్‌విఎం-3 రాకెట్ ద్వారా మిషన్ చంద్రయాన్-3ని విజయవంతంగా ప్రయోగించారు. ప్రస్తుతం ఇదే స్ఫూర్తితో ఎల్‌విఎం-3 లాంచ్ వెహికల్ ద్వారా 5వ ఆపరేషనల్ ఫ్లైట్ సహకారంతో సిఎంఎస్-03 కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని ప్రయోగించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ఈ రాకెట్ ప్రయోగ వేదికకు తరలించారు. అన్నీ సక్రమంగా జరిగితే నవంబర్ 2న ప్రయోగం జరుగుతుంది. ఇస్రో ఛైర్మన్ నారాయణన్ ఆధ్వర్యంలో షార్ డైరెక్టర్ ఇఎస్ పద్మకుమార్ పర్యవేక్షణలో ఇతర శాస్త్రవేత్తల సహకారంతో ప్రయోగానికి సన్నాహాలు ముమ్మరంగా జరుగుతున్నాయి.

# సమన్వయంతో విధులు నిర్వహించాలి

**కలెక్టరేట్ లోని కంట్రోల్ రూమ్‌ను జిల్లా కలెక్టర్ తనిఖీ**

తిరుపతి కలెక్టరేట్, అక్టోబర్ 26 ప్రభాతవార్త :
"మొంథా" తుఫాను ప్రభావంతో జిల్లాలో రానున్న ఐదు రోజుల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురవనున్న నేపథ్యంలో అధికారులందరూ సమన్వయంతో విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఆదివారం ఉదయం తిరుపతికలెక్టరేట్ లోని కంట్రోల్ రూమ్ ను తనిఖీ చేసి అక్కడ విధులు నిర్వహిస్తున్న ఇరిగేషన్, విద్యుత్, ఆర్ అండ్ బి ,పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్, ఆర్టీసీ, మెడికల్ పోలీస్,అగ్నిమాపక శాఖ, రెవెన్యూ శాఖలకు చెందిన అధికారులతో తుఫాను సందర్భంగా తీసుకోవలసిన చర్యలపై జిల్లా కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు...ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ "మొంథా" తుఫానును తేలికగా తీసుకోరాదని, ఈ నెల 27,28,29 తేదీలలో ఇది మరింత తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. తుఫాను సందర్భంగా ఎప్పటికప్పుడు తలెత్తే పరిస్థితులపై ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఏ పి ఎస్ డి సి ఎల్ కు సంబంధించి విద్యుత్ స్థంబాలు, తదితర పరికరాలను ముందుగానే సమకూర్చుకొని, విద్యుత్ అంతరాయాలు లేకుండా చూడాలన్నారు. ఆ శాఖకు సంబందించిన సిబ్బంది అందరు వారి వారి ప్రాంతాలలో ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు. క్షేత్ర స్థాయిలో సిబ్బందిని నియమించుకొని ఎప్పటికప్పుడు మేజర్ ప్రాజెక్ట్స్, మైనర్ ప్రాజెక్ట్స్, కెనాల్స్ ను తరచుగా నీటి మట్టాలను పరిశీలిస్తూ తదనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్, ఆర్‌అండ్ బి , పంచాయతీ రాజ్ శాఖల అధికారులను ఆదేశించారు. కంట్రోల్ రూమ్ లోని రెవెన్యూ అధికారులు అన్ని శాఖలతో సమన్వయము చేసుకోవాలన్నారు. జిల్లాలోని ఆర్‌డిఓ లు, తహసీల్దార్ లు, ఇతర లైన్ డిపార్టుమెంట్లు సమన్వయము చేసుకోవా లన్నారు.అలాగే ముందస్తుగా జేసిబిలు, క్రేన్‌లు,తదితర సామగ్రిని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆర్టీసీ బస్సులు సాధారణంగా ప్రయాణించేప్రాంతంలో కాజ్ వే లు ,ఇతర లోతట్టుగా వున్న బ్రిడ్జ్ లపై నీళ్ల పొంగి ప్రవహిస్తున్నపుడు ప్రత్యామ్నాయ మార్గాలలో సురక్షితంగా ప్రయాణికులను చేరవేసేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిఆర్ఓ నరసింహులు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరులో

# మళ్ళీ టెన్షన్

**నేడు మేయర్ దంపతుల హత్య కేసులో నేర నిరూపణ అయిన వారికి శిక్ష ఖరారు**

**- డిఎస్పీ సాయినాథ్ ఆధ్వర్యంలో విస్తృతంగా భద్రతా ఏర్పాట్లు**

చిత్తూరు, అక్టోబర్ 26 ప్రభాతవార్త:
చిత్తూరు నగరం సోమవారం మరోసారి టెన్షన్‌లోకి వెళ్ళనుంది. మేయర్ దంపతులు కఠారి అనురాధ, కఠారి మోహన్‌ల హత్య కేసులో నేర నిరూపణ అయిన ఐదు మంది నిందితులకు సోమవారం జడ్జి శిక్షలు ఖరారు చేయనుండటంతో చిత్తూరు జిల్లా కోర్టు ప్రాంగణంతో పాటు మేయర్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్యే సికె బాబు ఇళ్ళతో పాటు చిత్తూరు నగర పరిధిలో పోలీసులు గట్టి భద్రతా ఏర్పాట్లను చేపట్టారు. న్యాయవ్యవస్థకు సంబంధించిన అధికారులు, కార్యాలయాలకు పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే జడ్జి శ్రీనివాసరావుతో పాటు ఎపిపి నివాసం వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. నగరంలో ఎలాంటి ర్యాలీలు, ధర్నాలు, ప్రజా కార్యక్రమాలకు అనుమతులను పోలీసులు రద్దు చేశారు. కోర్టు పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్ళింపులతో పాటు సోషల్ మీడియాలో రెండు వర్గాలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకుండా, విబేధాలు ప్రోత్సహించకుండా వుండేలా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

# ప్రమాదస్థితిలో చెరువులు, వంకలు

**-నీట మునుగుతున్న పంటలు**

ప్రమాదస్థితిలో చారాలపెద్దచెరువు మొరవ, నీటి ప్రవాహానికి దెబ్బతిన్న వరి పంట

చౌడేపల్లి, అక్టోబర్ 26 ప్రభాతవార్త

మండల వ్యాప్తంగా వారం రోజులుగా వరుసగా వర్షాలు కురుస్తున్నందున చెరువులు, వంకలు నిండు కుండలా మారాయి. దాదాపుగా అన్ని చెరువులు మొరవలు పో తున్నాయి. దీంతో ఆయకట్టకింద గల పంటలు నీటి ముని గాయి. ముఖ్యంగా వరి, టమోటా వంటి వాణిజ్య పంటలతో పాటుగా కూరగాయలకు చెందిన పంటలు సైతం నీట మునగడంతో రైతులు లబో దిబోమంటున్నారు. ప్రకృతి పగ పట్టిందా అన్నట్లుగా రైతుల పాలిట వర్షాలు శాపాలుగా మారుతున్నాయి. పంటలు చేతికందే సమయంలో యేటా ఏదో రూపంలో నష్టపోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఇదిలా వుంటే కూలీల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. కూలీ చేస్తేకానీ కుండగాలని స్థితిలో వున్న తమకు వర్షాలు మరింతగా కుంగ దీస్తున్నాయంటున్నారు. వర్షాల వల్ల ఇటు రైతులు, అటు కూలీలే కాకుండా ఊర్లకు వెళ్ళే రోడ్డు మార్గాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. కల్వర్టులు నిర్మించక పోవడంతో పలు రహదారులు వర్షనీటి ధాటికి కోతకు గురవు తున్నాయి. చారాల, దుర్గసముద్రం, పందిళ్ళపల్లి, ఎ.కొత్తకోట, గడ్డంవారిపల్లి, పరికిదొన, ఆమినిగుంట తదితర పంచాయతీల్లో చెరువులు నిండి మొరవపోతున్నాయి. బుటక పల్లి, శెట్టిపేట పెద్దచెరుల కట్టలు ప్రమాదస్థితిలో వున్నాయి. ఆయా కట్టలు తెగితే ఊర్లకు ఊర్లు కొట్టుకుపోయే ప్రమాదముంది. పలమనేరు ప్రధాన మార్గంలోని చారాల పెద్దచెరువుల మొరవ వల్ల జంగాలపల్లి-చారాల మధ్య సంబంధాలు తెగిపోయాయి. అదే విధంగా పలమనేరు ప్రధాన రహదారి నుంచి ఓడులపేటకు 2కిలోమీటర్ల మేర తారు రోడ్డు వుంది. రోడ్డుపైనే వరద నీరు ప్రవహిస్తుండటంతో దాదాపుగా కిలోమీటరు మేర రోడ్డు కోతకు గురైంది. వరుస కుండపోత వర్షాలు మూలంగా ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

## టిడిపి మండల అధ్యక్షుడిని సత్కరించిన నేతలు

కుప్పం,అక్టోబర్ 26ప్రభాతవార్త కుప్పం మండల టిడిపి అధ్యక్షుడు రాజగోపాల్‌ను ఆదివారం దళిత, ఎం ఆర్‌పిఎస్ నేతలు ఘనంగా సత్కరించారు. భవిష్యత్తులో రాజగోపాల్ మరిన్ని పదవులు అలంకరించాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ అధ్యక్షుడు కళైసెల్వం, ఎంఆర్‌పిఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు రాజ్‌కుమార్, కడ సభ్యు డు రామచంద్ర, నేతలు విభూషణ్, దాము, రమేష్,ప్రకాష్, వెంక టేష్,నాగు,సుభాష్,రాజ్‌కుమార్,సుధాకర్, రమేష్, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

## రైలు ఢీకొని మహిళ మృతి

కుప్పం,అక్టోబర్ 26 ప్రభాతవార్త

చెన్నై- బెంగళూరు రైలు మార్గంలో స్థానిక ష్లెఓవర్ వంతెనసమీపంలో రైలు ఢీకొని ఓ మహిళ మృతి చెందినట్లురైల్వే పోలీసులు తెలిపారు.మృతురాలు తంబిగానిపల్లి ఎస్సీకాలనీకి చెందిన లేట్ శ్రీనివాసన్ భార్య మాదమ్మ (48)గా గుర్తించామని తెలిపారు. మృతదేహాన్నిప ంచనామా నిర్వహించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లుతెలిపారు.

## సిఎం చంద్రబాబు దుబాయ్‌పర్యటన జయప్రదం : మాజీ ఎమ్మెల్సీ గౌనివారి

శాంతిపురం, అక్టోబర్26 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు దుబాయ్ పర్యటన, మంత్రి నారా లోకేష్ ఆస్ట్రేలియా పర్యటనలు దిగ్విజయమై ందని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివా సులు పేర్కొన్నారు. రాష్ట్రాభివృద్ధి,ప్రజలసంక్షేమమే అజెండాగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రాష్ట్ర భవిష్యత్తుకై సిఎం చంద్రబాబునాయుడు, మంత్రి లో కేష్ అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. ఎపిని ప్రపంచపెట్టుబడుల గమ్యంగా మా ర్చిలా సిఎం చంద్రబాబు దుబాయ్ పర్యటన సాగిందన్నారు. అమరావతి, వైజాగ్, తిరుపతి నగరాలు టెక్నాలజీ, ఆవిష్కరణలు, పరిశ్రమల కేంద్రాలుగా ఎదుగు తాయన్నారు. వైకాపా చేయలేని అభివృద్ధిని వారు కోల్పోయినపెట్టుబడులను కూటమి ప్రభుత్వం తిరిగి తెస్తోందన్నారు.

## కార్యకర్తలే పార్టీకి అండ - వైకాపా జిల్లా ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి

శాంతిపురం,అక్టోబర్26 ప్రభాతవార్త

వైకాపాకు కార్యకర్తలేకొండంత అండ అని వైకాపా జిల్లా ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి,మాజీ రెస్కోఛైర్మన్ చక్రపాణిరెడ్డి పేర్కొన్నారు.ఆదివారం మఠం, కెనమాకులపల్లి, శివరాంపురం,రేగడదిన్నేపల్లి పంచాయతీల్లో పార్టీ పంచాయతీ కమిటీ ఎన్నికలు నిర్వహించి కార్యవర్గా లను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా వారుమాట్లాడు తూగ్రామాల్లో పార్టీ బలోపేతానికి నూతనకమిటీలు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్‌దండపాణి,పెద్ద న్న,కృష్ణమూర్తి,చలపతి,మురుగన్, సోమ శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఉపాధి వృత్తులకు విద్యార్థులకు అవగాహన

రామకుప్పం,అక్టోబర్26 ప్రభాతవార్త

విద్యార్థులు చిన్నతనం నుంచేఉపాధి వృత్తులపై అవ గాహన పెంచుకోవాలని విజలాపురం జడ్పీహై స్కూల్ హెచ్ఎం శివకుమార్ పేర్కొన్నారు. ఆదివారం విద్యార్థులకు శాంతిపురంలోని దానియా సోలార్ పవర్ ప్లాంట్, పాల డెయిరీ, టివిఎస్‌షోరూంల సందర్శన విజ్ఞానయాత్ర నిర్వహించారు. కార్యక్రమం లో ఉపాధ్యాయులు హరీష్, వివేకానంద, రమేష్, ఎస్ఎంసి ఛైర్మన్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి చెక్కు అందజేత

రామకుప్పం, అక్టోబర్ 26 ప్రభాతవార్త

మండలంలోని బందార్లపల్లి పంచాయతీగోవింద రాజపురంకు చెందిన వెంకటేష్ ఆరోగ్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన 2.08లక్షల చెక్కును తెదేపా నేతలు అందించారు. కార్యక్రమంలో నేతలు వెంకటరమణ,ఆనందరెడ్డి, మునిరెడ్డి,గంట్లరెడ్డి, పెరుమాళ్, రవిరెడ్డి,నవీన్, సతీష్, చంద్రశేఖర్‌రెడ్డి, ఆదిల్,గిరి, ఆనందప్ప, చంద్రబాబురెడ్డి,మోహన్, మురళి పాల్గొన్నారు.

## దేశం సీనియర్ నేత మృతి

రామకుప్పం, అక్టోబర్ 26 ప్రభాతవార్త

మండలంలోని బందార్లపల్లికి చెందిన తెదేపా సీనియర్ నేత పద్మనాభం తండ్రి వెంకటేశప్ప అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నేతలు వెంకటేశప్ప మృతదేహంకు ఘననివాళులు అర్పించారు. కార్యక్రమంలో నేతలు ఆనందరెడ్డి, విశ్వనాథ్,మునిరెడ్డి, పెరుమాళ్, శ్రీనాథరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కోదండరెడ్డి, సుబ్రమణ్యం, మురళీమోహన్, ఆనందప్ప పాల్గొన్నారు.

## తుఫాను పట్లఅప్రమత్తంగా ఉండాలి

వి.కోట,అక్టోబర్ 26 ప్రభాతవార్త

మొంథా తుఫానుపట్ల మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ ఉదయ్ సంతోష్ పేర్కొన్నారు. మండలంలో మొత్తం 140చెరువులు ఉండగా వాటిలో ఇరవై చెరువులు నిండాయన్నారు. కృష్ణాజలాలతో మరో 16 చెరువులు నిండా యన్నారు. చెరువులు,కుంటల వద్ద పిల్లలను పంపకుండా తల్లిదండ్రులు జా గ్రత్త వహిం చాలన్నారు. పశువులకు రైతులుముందుగానే మేత సిద్ధంగా ఉంచుకోవా లన్నారు. విఆర్వోలు చెరువులు,కుంటల నీటి ప్రవాహంపైప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాల న్నారు.

## సిరి కళాక్షేత్రంలో సినిమా ఆడిషన్స్

కుప్పం,అక్టోబర్ 26 ప్రభాతవార్త

రాయలసీమ నేపథ్యంలో తెరకెక్కనున్న రాయలసీమప్రేమకథ చిత్రానికి సంబందించి దర్శకుడు గోపి వర్మ,నిర్మాత రాజశేఖర్‌లు కుప్పంలోని సిరి కళాక్షేత్రంలో ఆదివారం సినిమా ఆడిషన్స్ నిర్వహించారు. సుమారు రెండువందలమంది దాకా యువతీ యువకులు, పిల్లలు ఈ కార్యక్రమంలో హాజరైనట్లు సిరికళా క్షేత్రం వ్యవస్థాపకులు అంబామహేష్, సునీత తెలిపారు. స్థానిక యువతను ప్రోత్సహించాలనేది తమ లక్ష్యమన్నారు. త్వరలోనే సినిమా షూటింగ్ కుప్పంలో మొదలుపెడతామని డైరెక్టర్,నిర్మాత తెలిపారు. ఈచిత్రం రాయలసీమ సా ంస్కృతిక విలువలు,ప్రేమ, భావోద్వేగాలు ప్రతిబింబించేలా ఉంటుందన్నారు.

## జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ జయప్రదం చేయాలని పిలుపు

– సీనియర్ జనసేన పార్టీ జిల్లా నేత పగడాల శశికాంత్

**చిత్తూరురూరల్, అక్టోబరు 26 ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా, గుడిపాల మండలంలో ఈనెల 29న జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమంను పార్టీనాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున వచ్చి జయప్రదం చేయాలని మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించినట్లు సీనియర్ జనసేన పార్టీ జిల్లా నేత పగడాల శశికాంత్ తెలిపారు. ఆదివారం రెండు రోజుల ఉమ్మడి చిత్తూరు జిల్లాల పర్యటన ముగించుకొని తిరుగు ప్రయాణంలో వెళుతున్న రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా రేణిగుంట విమానాశ్రయంలో మండలంలో నిర్వహించ తలపెట్టిన జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ ఆహ్వాన పత్రికను పార్టీ శ్రేణులతో కలసి ఆవిష్కరింపచేసారు. ప్రజాసంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం ప్రజల కోసం చేస్తున్న మంచి పనుల గురించి ప్రజానీకానికి తెలియజేయాలని అలాగే పార్టీ అధిష్టానం సూచనల మేరకు ఉన్నత ఆశయంతో నిర్వహిస్తున్న జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొని తమ ఐక్యతను చాటాలని మనోహర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నేతలు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, సుభాషిని, తాతంశెట్టి నాగేంద్ర, కిరణ్‌రాయల్, మై ఫోర్స్ మహేష్, రాజారెడ్డి, దేవర మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## పక్కా గృహాల నిర్మాణాలకు దరఖాస్తు చేసుకోండి

– అర్హులైన అందరికీ ఇల్లు మంజూరు – చల్లా రామచంద్రారెడ్డి

**కల్లూరు, అక్టోబర్ 26, ప్రభాతవార్త** పుంగనూరు నియోజకవర్గంలో పక్కా గృహాల నిర్మాణాలకు దరఖాస్తు చేసుకోవాలని, అర్హులైన అందరికీ ఇల్లు మంజూరు అవుతుందనే, పుంగనూరు నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఆవాస్ ప్లస్ సర్వే ద్వారా ఇంటి స్థలము మరియు పట్టా ఉన్నవారికి అనగా (పొజీషన్ సర్టిఫికెట్, రిజిస్టర్ పట్టా లేదా గవర్నమెంట్ పట్టా) ఉన్నవారికి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకం క్రింద పుంగనూరు నియోజకవర్గంలోని మండలాలలో అన్ని పంచాయతీలకు సంబంధించి ఎవరైతే ఇంటి మంజూరుకు అర్హులైన వారు ఉంటారో వారందరూ సంబంధిత గ్రామ సచివాలయంలో నవంబర్ 5వ తేదీ లోపూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఇవ్వడం జరిగింది. మీ గ్రామ సచివాలయంలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్ల ద్వారా మీరు మీ వివరాలను ఆవాస్ యాప్‌లో పొందుపరచాల్సి ఉంటుంది. అందుకు గాను మండలంలోని పంచాయతీ కార్యదర్శులు మరియు గ్రామ రెవెన్యూ అధికారులు అందరూ సహాయ సహకారాలు అందిస్తారు. పుంగనూరు నియోజకవర్గంలోని ఎన్‌డిఏ కూటమి నాయకులు, కార్యకర్తలు మీ మండలాలలో, పంచాయతీల్లో, గ్రామాలలో ఈ యొక్క సమాచారాన్ని అర్హులైన లబ్ధిదారులందరికి తెలియజేసి నవంబర్ 5వ తేదీ లోపల నమోదు చేసుకునే విధంగా చేయాలని చల్లా రామచంద్రారెడ్డి కోరారు.

## సూపర్ బజార్‌లోకి భారీగా వర్షపు నీరు

పలమనేరు, అక్టోబర్ 26 ప్రభాతవార్త:

పలమనేరు బాలాజీ కో ఆపరేటివ్ సూపర్‌బజార్‌లోకి భారీగా వర్షపు నీరు చేరింది. శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి నీరు చేరడంతో సరుకులంతా తడిసి ముద్ద య్యాయి. రాత్రి సూపర్ బజార్ మూసే సమయంలో హటాత్తుగా కుంభవృష్టిగా రెండు గంటల పాటు వర్షం కురిసింది. దీనికితోడు పక్కనే ఉన్న ఆర్టీసీ బస్టాండులోనూ వర్షం దెబ్బకు చెరువులా నీరు నిండిపోవడం ఈ నీరంతా సూపర్‌బాజర్‌వైపు రావడంతో సూపర్‌బజార్ ముందు కూడా నడుములోతు నీరు చేరింది. ఈ నీరంతా సూపర్‌బాజర్‌లో ప్రవేశించడంతో హాహాకారాలు మిన్నుముట్టాయి. ఓ వైపు ప్రవాహంలా వస్తున్న నీటిని అరికట్టడం సాధ్యం కాక పోవడం మరో వైపు తడిసి పోతున్న సరుకులు భద్ర పరచడం సిబ్బందికి కష్టసాధ్యమైంది. చివరకు రెండు మూడుగంటల అనంతరం వర్షం తగ్గుముఖం పట్టడంతో సిబ్బంది బకెట్లు, గిన్నెలతో నీరు తోడి బయటకు పార బోశారు. సూపర్‌బాజర్ ఏర్పాటై దాదాపు 40 ఏళ్ళ కాలంలో ఇంతవరకు ఎప్పుడూ లేని విధంగా వర్షం నీరు సూపర్‌బజార్‌లో చేరడం ఇదే ప్రథమం.

## అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉంది: జాగ్రత్త :తహశీల్దార్

పూతలపట్టు, అక్టోబర్ 26, ప్రభాతవార్త

బంగాళాఖాతంలోని తీవ్రవాయుగుండం తుఫానుగా బలపడింది. రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశాలు ఉంది సోమ, మంగళ, బుధవారం గ్రామాలలో ఎక్కడికి పోకుండా మూసుకోవాలి లేకుంటే కఠిన చర్యలు ఉంటాయని విఆర్ఓలకు తాసిల్దార్ రమేష్ బాబు చరవాణి ద్వారా ఆదేశం చారు. ఆయన వీఆర్వోల సర్వేర్లతో మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలు ఎవరు కూడా పంట పొలాల వద్దకు చెరువులు వద్దకు వంక కాలవల వద్దకి ప్రాంతాల వద్దకి వెళ్ళకూడదుని ప్రాణహాని కలగకుండా గ్రామాలలో ప్రజలు ఫోన్ చేస్తే విఆర్ఓలో అందుబాటులో ఉండాలని హెచ్చరించారు. అంతే కాకుండా అత్యవసరమైన సందర్భంలో తప్ప బయటకు వెళ్లకండని బలమైన ఈదురుగాలు వీచే అవకాశం చెట్ల కింద నిలబడరాదు ఇంటి దగ్గర నుండి బయటికి రాకూడదు మండల ప్రజలకు హెచ్చరించారు మెరుపులు ఉన్న సమయంలో మొబైల్ ఫోన్లో లేదాఎలక్ట్రానిక్‌పరికరాలు ఉపయోగించరాదని గ్రామాలలో విఆర్ఓ లు ప్రజలకు తెలియ జేయా లన్నారు.

## చిగరపల్లె వద్ద రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కాణిపాకం, అక్టోబర్ 26 ప్రభాతవార్త:

కాణిపాకం పోలీస్‌స్టేషన్ పరిధిలోని బెంగుళూరు-తిరుపతి సిక్స్‌లేన్ రహదారిలోని చిగరపల్లె వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందాడు. స్థానిక పోలీసుల కథనం మేరకు వివరాలిలావున్నాయి, తవణంపల్లె మండలం ఎగువ తవణంపల్లెకు అరుందతివాడకు చెందిన నాగరాజు(40) అనే వ్యక్తి ఆదివారం పూతలపట్టు మండలం బుసిపల్లెలో తమ సమీప బంధువు మృతి చెందడంతో కార్యక్రమానికి హాజరయ్యాడు. సాయంత్రం తన మోటారు సైకిల్‌పై తిరుగు ప్రయాణమయ్యాడు, ఇతను చిగరపల్లె వద్ద వస్తుండగా మోటారు సైకిల్ ఆతుపుతపి ్ రోడ్డు డివైడర్‌ను ఢీకొన్నాడు. దీనితో తీవ్రగాయాలకు గురై అక్కడిక్కడే మృతి చెందాడు.మృతుడు నాగరాజు అమరరాజ కంపెనీలో పనిచేస్తున్నాడు, ఇతనికి భార్య. కుమారుడు వున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక పోలీసులు తెలిపారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

చిత్తూరు, అక్టోబర్ 26 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంను ఈ వారం మొంథా తుఫాను తీవ్రత తీవ్రంగా వున్న నేపథ్యంలో రద్దు చేశారు. ఈ మేరకు ప్రజలు ఎవ్వరు సమస్యలు చేతపట్టుకుని ఈ సోమవారం కలెక్టరేట్‌కు రావద్దని కలెక్టర్ సుమిత్‌కుమార్ కోరారు.

## నేడు పోలీసు గ్రీవెన్స్ రద్దు

చిత్తూరు, అక్టోబర్ 26 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి చిత్తూరు పాత జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి సోమవారం ఎస్పీ తుషార్ డూడి ఆధ్వర్యంలో నిర్వహించే పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంను ఎస్పీ రద్దు చేశారు. ప్రజా సమస్య పరిష్కార వేదిక కార్యక్రమంను సోమవారం రద్దు చేయ డంతో ప్రజలు ఎవ్వరు సమస్యలపై అర్జీలు తీసుకుని జిల్లా పాత పోలీసు కార్యాలయంకు రావద్దని ఎస్పీ కోరారు.

## మొంథాతో అప్రమత్తం

పెనుమూరు, అక్టోబర్ 26 ప్రభాతవార్త:

మొంథా తుఫాను నేపథ్యంలో ప్రజలు విద్యుత్ విషయమై అప్రమత్తంగా వుండాలని ట్రాన్స్‌కో ఎఇ తులసి ప్రసాద్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నప్పటికీ తాము 24 గంటల పాటు విద్యుత్ సరఫరాను చేస్తున్నామని, వ్యవసాయం, తాగునీటి అవసరాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తున్నామన్నారు. తుఫాను ప్రభావంతో వర్షాల వల్ల ఎక్కడైనా వ్యవసాయ పొలాల్లో, గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు దెబ్బ తిన్నా, గాలికి విద్యుత్ తీగలు కిందపడిపోయినా సత్వరం ట్రాన్స్‌కో సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. అలాగే సింగిల్ ట్రాన్స్‌ఫార్మర్ల ఫీజు పోతే ప్రజలు ఎవ్వరు ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు వెళ్ళి ఫీజు వేయడానికి ప్రయత్నించవద్దని, వర్షాలు కురిసే సమయంలో ప్రజలు ఎవ్వ రు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు దగ్గరలో వుండకూడదన్నారు. ఎక్కడైనా విద్యుత్ సరఫ రాకు అంతరాయం ఏర్పడితే సత్వరం తమ సిబ్బంది దృష్టికి తీసుకువస్తే పునరుద్దరించడానికి చర్యలు తీసుకుంటారన్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతి

బంగారుపాళ్యం, అక్టోబర్ 26 ప్రభాతవార్త:

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఓ గుర్తుతెలియని వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. తీవ్ర అనారోగ్యంతో వున్న గుర్తుతెలియని వ్యక్తి రెండు రోజుల క్రితం ఆసుపత్రి ఆవరణలో కుప్పకూలాడు. వైద్య సిబ్బంది అతనికి వైద్య పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించారు. ఆ వ్యక్తికి సంబంధించిన వారు ఎవ్వరు ఆసుపత్రి వద్దకు రాలేదు. ఈ పరిస్థితుల్లో ఆదివారం తీవ్ర అస్వస్థతకు గురైన ఆ వ్యక్తి ఆసుపత్రి ఆవరణలోనే మృతి చెందాడు. ఈ మేరకు సిబ్బంది స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహం ఆచూకీ కోసం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి ఆచూకి గుర్తించిన వారు బంగారుపాళ్యం పోలీసులను సంప్రదించాలని సిఐ కత్తి శ్రీనివాసులు తెలిపారు.

## ప్రమాదం అంచున కామాక్షమ్మ చెరువు

బంగారుపాళ్యం, అక్టోబర్ 26 ప్రభాతవార్త:

బంగారుపాళ్యం గ్రామ పంచాయతీ ఊటువంక గ్రామ సమీపంలోని కామాక్షమ్మ చెరువు ప్రమాదం అంచుకు చేరుకుంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు చెరువులోకి 80 శాతం వరకు నీరు వచ్చి చేరింది. చెరువు కట్టకు ఒకవైపున నీరు కట్ట కింద నుండి వెళ్తున్నది, ఈ విషయంను గుర్తించిన రైతులు, గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్ళారు. వెంటనే తహసిల్దారు రాజేంద్రప్రసాద్, పోలీసులు, ఇతర రెవెన్యూ సిబ్బంది చెరువు కట్ట వద్దకు చేరుకుని లీకు అవుతున్న నీటిని గుర్తించారు. వెంటనే ఇసుక బస్తాలు, మట్టిని ట్రాక్టర్ల ద్వారా తరలించి లీకేజీకి అడ్డుకట్ట వేశారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఆదివారం సాయంత్రం జిల్లా తెలుగుదేశం నాయకుడు ఎన్‌పి జయప్రకాష్, ఇతర నాయకులు ఈ చెరువు కట్టను పరిశీలించారు.

## జిల్లా ప్రత్యేక అధికారిగా ఎస్ గిరీష

చిత్తూరు, అక్టోబర్ 26 ప్రభాతవార్త:

చిత్తూరు జిల్లాకు ప్రత్యేక అధికారిగా సీనియర్ ఐఎఎస్ అధికారి గిరీషను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. మొంథా తుఫాను నేపథ్యంలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు సహాయ సహకారాలు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం జిల్లా ప్రత్యేక అధికారిగా సీనియర్ ఐఎఎస్ అధికారి గిరీషను నియమించింది. తుఫాను ప్రభావంతగ్గుముఖంపట్టిజిల్లాలోమళ్ళీ సాధారణ పరిస్థితులు వచ్చే వరకు గిరీష జిల్లాలో విధులు నిర్వహిస్తారు.

## శ్రీ ప్రియ నర్సింగ్ హోంచే 250మందికి ఉచిత పరీక్షలు

కుప్పం,అక్టోబర్ 26 ప్రభాతవార్త

కుప్పంలోని శ్రీ ప్రియనర్సింగ్‌హోం అధినేత డా॥ సుధీర్ అధ్వర్యంలో ఆదివారం మండలంలోని పైచెక్కునత్తం గ్రామంలో నిర్వహించినమెగా ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మొత్తం 250 మందికి వైద్యులు ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు,మాత్రలు పంపిణీ చేశారు. అలాగే మరో యాభైమందిని రెఫర్‌చేశారు. ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, డిఎస్పీ పార్థసారథి, టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, తెలుగుయువత రాష్ట్ర నేత చెక్కునత్తం మణి, మాజీ ఎంపిపిలు సాంబశివం, డా॥ వెంకటేష్, సంతోష్ హాజరై శిబిరాన్నిపరిశీలించారు. కార్యక్రమంలో వైద్యులు వెంకటేష్, వెంకటలక్ష్మి, సౌరభ్ కులకర్ణి, ప్రశాంత్,సుబ్బారెడ్డి, సూర్య, సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

**కల్లూరు, అక్టోబర్ 26, ప్రభాతవార్త** పులిచెర్ల మండలం దేవళం పేట శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసం పంచమి ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అర్చనలు పూజలు జరిపి నైవేద్యం సమర్పించి మహా మంగళహారతి గావించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఫణి ప్రకాష్ శర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఎడతెరిపిలేని వర్షం ముంచుకొస్తున్న ముప్పు

సోమల అక్టోబర్ 26 (ప్రభాతవార్త)

గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురు స్తున్న వర్షంతో పాటు శనివారం సాయంత్రం ఒకటిన్నర గంట పాటు కుంభవృష్టి కురవడంతో జనజీవనం అస్తవ్యస్తమవుతుంది. శనివారం సోమలలో వారపు సంతకావడంతో భారీ వర్షానికి కూరగాయలు కొట్టుకొని పోయాయి. వాగులు వంకలు పొంగిపొర్లు తున్నాయి. అనేక రహదారులలో కల్వర్టులు కూలి రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. రహదారు లను పునరుద్ధరించేందుకు వర్షపు నీటిని చూసి అధికారులు కూడా వెనుకాడుతున్నారు. చాలా చెరువులకు దశాబ్దాలుగా మరమ్మత్తులు లేకపోవడంతో ప్రమాద స్థాయికి చేరుకున్నాయి. తాజాగా సోమల పుంగనూరు మార్గంలో బోయకొండ గంగమ్మ ఆలయం వద్ద వరదనీరు రోడ్డుపైకి రావడంతో రెండు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఎగువనున్న చెరువులు నిండిపోవడంతో పల్లం లో ఉన్న గ్రామాలలో ఊట నీరు ప్రవహిస్తోంది. దీంతో ఎలాంటి ప్రమాదకర పరిస్థితులు ఎదుర్కో వాలోనని ప్రజలు భయభ్రాంతుల వుతున్నారు. తాజాగా మెంథా తుఫాన్ కారణంతో మూడు రోజులపాటు భారీ వర్షాలు కురవనున్న దృశ్య ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాసిల్దార్ మధుసూదన్ ఓ సర్కులర్ జారీ చేశారు. వీఆర్వోలు గ్రామ కార్యదర్శులు వీఆర్ఏలు గ్రామాల్లోని ఉండి పరిస్థితులు ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశాలు కూడా జారీ చేశారు. మండలంలో అతిపెద్ద చెరువువయిన చెన్నపట్నం చెరువు మెరవ ఉధృతంగా ప్రవహిస్తున్నందువల్ల పర్యాటకులు పిల్లలు అధిక సంఖ్యలో వెళుతున్నారు. అక్కడ వెళ్లేందుకు నిషేధం విధిస్తున్నట్లు తహసిల్దార్ తెలిపారు

## ముంథా తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

**చౌడేపల్లి, అక్టోబర్ 26 ప్రభాతవార్త** ముంచుకొస్తున్న ముంథా తుఫాన్ పట్ల మండల ప్రజలు అప్రమత్తంగా వుండాలని తహశీల్దార్ పార్వతి కోరారు. రాబోయే 3రోజుల్లో తుఫాన్ ప్రభావం అధికంగా వుంటుందన్న కలెక్టర్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే కురుస్తున్న వర్షాల వల్ల మండల వ్యాప్తంగా దాదాపుగా అన్ని చెరువులు నిండి మొరవలు పోతున్నాయనీ, ఆయా చెరువుల వద్దకు ప్రజలు వెళ్లరాదన్నారు. పిల్లలను చెరువు మొరవల వద్దకు వెళ్లనీయకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ మూడు రోజులు ప్రయాణాలు రద్దు పరచుకోవాలనీ, లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలు ఎక్కడైనా ప్రమాదమని తెలిస్తే వెంటనే సమీపంలోని సచివాలయాల్లో తెలియపరచాలన్నారు. విద్యుత్‌తీగలు, శిథిలావస్థకు చేరుకొన్న భవనాలు, చెట్లవద్దకు వెళ్ళరాదనీ, వేగంగా వీచే గాలుల పట్ల మరింత అప్రమత్తంగా వుండాలన్నారు. అత్యవసరమనిపిస్తే 9491077071, 6301181477నంబర్లలో సంప్రదించాలన్నారు. ప్రభుత్వ శాఖలన్నీ ముంథా తుఫాన్ పట్ల అప్రమత్తంగా వుండి, సేవలందిస్తున్నట్లు వివరించారు.

## జర్నలిస్టుల సంక్షేమమే 'జాప్' యూనియన్ ధ్యేయం

– వ్యవస్థాపక అధ్యక్షులు ఉప్పల లక్ష్మణ్

**చిత్తూరురూరల్, అక్టోబరు 26 ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా పాత్రికేయులు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల జాప్ యూనియన్ ఎల్లవేళలా అండగా వుంటుం దని, రానున్న రోజుల్లో జర్నలిస్టుల అభ్యున్నతికి కృషి చేస్తుందని జాప్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉప్పల లక్ష్మణ్ పేర్కొన్నారు. ఆదివారం జాప్ యూనియన్ 33వ మహా సభలను వ్యవస్థాపక అధ్యక్షులు ఉప్పల లక్ష్మణ్, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీపతి ఆధ్వర్యంలో జిల్లా జాప్ యూనియన్ అధ్యక్షులు జాన్‌బాబు, ప్రధాన కార్యదర్శి బాబు, ఫైరోజ్‌బాషా, ఉపాధ్యక్షులు సతీష్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ గౌరీశంకర్‌ల అధ్యక్షతన ఏర్పాటుచేసారు. రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి రవీంద్రబాబు, లక్ష్మీపతిలు మాట్లాడుతూ జర్నలిస్టుల అభ్యున్నతే ధ్యేయంగా జాప్ పనిచే స్తోందని, ముఖ్యమంత్రి చంద్రబాబు, సమాచారశాఖ మంత్రి పార్థసారధి సంబంధిత అధికారులతో చర్చిం చి పాత్రికేయులు ఎదుర్కొంటున్న సమస్యలు, సంక్షేమ

## మొంథా తుఫాను పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**పాకాల, అక్టోబర్ 26, ప్రభాతవార్త** మొంథా తుఫాను పట్ల మండల అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని తిరుపతి జిల్లా పాకాల తహసిల్దార్ సంతోష్ సాయి కోరారు.ఆదివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో రానున్న మొంథా తుఫాను ప్రభావంతో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై ఆయన మండల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. తహసిల్దారు సంతోష్ సాయి మాట్లా డుతూ రానున్న నాలుగైదు రోజుల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురవనున్న నేపథ్యంలో అధికారులందరూ సమన్వయంతో విధులు నిర్వర్తించాలన్నారు.అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగ మండల కేంద్రంలో అందుబాటులో ఉండాలని ఆయన సూచించారు. మోంథా తుఫానును తేలికగా తీసుకోవద్దన్నారు. ఈనెల 27,28,29 తేదీలలో ఇది మరింత తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అన్ని రకాల సహాయక చర్యలను తీసుకునే బాధ్యత మండలంలోని అన్ని శాఖల అధికారులపై ఉందన్నారు.అత్యవసరమైతే ప్రజలు తాసిల్దార్ కంట్రోల్ రూమ్ నెంబర్ 9492712100ని సంప్రదించాలన్నారు.

## నాదేండ్లను కలసిన రాయుడు చెల్లెలు

**తొట్టంబేడు,అక్టోబర్ 26 ప్రభాతవార్త**

శ్రీకాళహస్తిలో సంచలనం సృష్టించిన జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వినూత కోట వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్న జనసేనకు చెందిన రాయుడు హత్యకు గురైన విషయం విదితమే. ఈ సంఘటనలకు సంబంధించి కోర్టులో కేసులు నడుస్తున్నాయి.ఈ నేపథ్యంలో రాయుడు చెల్లెలు కుటుంబసభ్యులు ఆదివారం శ్రీకాళహస్తికి వచ్చిన మంత్రి నాదేండ్ల మనోహర్‌ను ఎస్ ఎస్ కన్వెన్షన్ హాలు వద్ద కలసి వినతి పత్రం అందించారు. తన హత్య వెనుక నిజ నిజాలు నిగ్గుతెల్చాలని కోరారు.ఈ సంఘటనపై తమకు న్యాయం జరగలేదని మంత్రికి వివరించగా మంత్రి స్పందించి తప్పక పవన్‌కళ్యాణ్‌తో సమావేశం ఏర్పాటు చేయిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు.

## కలంకారి జాతీయ అవార్డు గ్రహీత కన్నుమూత

**శ్రీకాళహస్తి,అక్టోబర్ 26 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి పేరు ప్రతిష్టలను మిక్కిలి ఇనుమడింపజేసిన కలంకారి కళను ఆస్వాదిస్తూ జాతీయ స్థాయిలో అవార్డును సాధించిన మాడంబాకం మునిరత్నమ్మ ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి తన సహాచరులతో వారి ఇంటికి చేరుకున్నారు.ఆమె భౌతిక కాయానికి పూల మాలలు సమర్పించారు.కుటుంబసభ్యులను ఓదార్చారు. శ్రీకాళహస్తి ఓ మంచి కళాకారుని పోగొట్టుకున్నామన్నారు.ఆ కటుంబానికి తాము అండగా ఉంటామని సుధీర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు.

ఫోటో -ఎస్‌కెహెచ్‌టి 3

రైటప్: కలంకారి జాతీయ అవార్డు గ్రహీతకు నివాళులర్పిస్తున్న ఎంఎల్ఏ

## బిగుసరై జాతీయ స్థాయి గోల్‌షాట్ బాల్ పోటీలకు బయలుదేరిన ఆంధ్రప్రదేశ్ జట్టు

**తిరుపతి క్రీడ, అక్టోబర్ 26, ప్రభాతవార్త**

అక్టోబర్ 29వ తేది నుంచి నవంబర్ 1వ తేది వరకు బీహార్‌లోని బిగుసరై జిల్లాలో జరిగేటటువంటి జాతీయ స్థాయి గోల్ షాట్ బాల్ పోటీలకు ఆంధ్ర ప్రదేశ్ జెట్టు ఆదివారం బయలుదేరారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి ఎం.మనోహర్ రెడ్డి, చిత్తూరు జిల్లా కార్యదర్శి మురళి, అనంతపురం జిల్లా కార్యదర్శిప్రసన్నకుమార్, తిరుపతిలో క్రీడాకారులకు క్రీడా దుస్తులను రాష్ట్ర కార్యదర్శి మనోహర్ అందించారు.

## వైకాపా ఉద్యమ పోస్టర్లను ఆవిష్కరించిన ఉన్నం

**తొట్టంబేడు,అక్టోబర్ 26 ప్రభాతవార్త** వైకాపా నాయకుడు ప్రకటించిన ప్రజా ఉద్యమం పోస్టర్‌ను ఆదివారం చిత్తూరుజిల్లా వైకాపా ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవనాయుడు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వాసుదేవనాయుడు మాట్లాడుతూ వైకాపా రాష్ట్ర నాయకుడు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మే రకు కార్యక్రమాలను నిర్వహించారు. రాబోవు రోజుల్లో ప్రజలు ఎప్పుడెప్పుడు అధికారం కట్ట బెడదామా? అని ఎదురుచూస్తున్నారని వివరించారు. నేడు రాష్ట్రంలో ప్రజలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతూ ఎందుకు కూటమికి అధికారం కట్టబెట్టామనా? అని వాపోతున్నారన్నారు. అందుకే ఉద్యమాలకు శ్రీకారం చుడుతున్నట్లు వాసుదేవనాయుడు వివరించారు. ఈ కార్యక్రమాల్లో వాసుదేవ నాయుడుతో మండల పార్టీ అధ్యక్షుడు కోగిల సుబ్రమణ్యం, మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని మోదీ మన్‌కీబాత్ స్ఫూర్తిదాయకం

**తిరుపతిరవాణ,అక్టోబర్ 26ప్రభాతవార్త:**

దేశ ప్రజలకు ఎప్పటికప్పుడు పరిస్థితులను వివరిస్తూ, అన్ని అంశాలపై అవగాహన చైతన్యం కలిగిస్తున్న ప్రధాని మోదీ మన్‌కీబాత్ స్ఫూర్తిదాయకమని బిజెపి నేత గుండాల గోపీనా ధరెడ్డి తెలిపారు.నాల్గవ ఆదివారం ఉదయం మన్‌కీబాత్‌ను తిరుపతిలో పార్టీ నాయకులు తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, సురేస్‌స్వామి, భాగ్యలక్ష్మి, సిద్దమ్మ, లక్ష్మయ్య, రాజశేఖర్‌రెడ్డి, వెంకటరత్నం, లోకనాధం, చెంగల్‌రాయలతో కలసి వీక్షించారు.

## శాసనసభ్యుని ప్రశంసించిన మంత్రి

**శ్రీకాళహస్తి,అక్టోబర్ 26 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి శాసనస భ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డిని జనసేన పార్టీ నాయకుడు రాష్ట్ర మంత్రి నాదేండ్ల మనోహర్ ప్రశంసల జల్లు కురిపిం చారు. కూటమిలోని తెలుగుదేశం,బిజెపి, జనసేన నాయకు లను కార్యకర్తలను పాలనా పరంగాను, పదవుల పంపిణి లోనూ అందరిని ఏక త్రాటిపై నడిపిస్తూ ముందుకెళుతున్న సుధీర్‌రెడ్డి అభినందనీయులని ప్రశంసించారు. రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం వివిధ ఆలయాలకు ధర్మకర్తల మండళ్ళను నియమించిన విషయం విదితమే. కానీ శ్రీకాళహస్తిలో మాత్రం శాసనసభ్యుడే అంతా తానై అన్నిపార్టీల సభ్యుల ద్వారా ప్రమాణం చేయించటం ఆయన నాయకత్వలక్షణానికి నిదర్శనం అన్నారు.పొత్తు ధర్మాన్ని పాటిస్తూ అధిష్టానం ఆదేశాలను తు.చ.తప్పక పాటిస్తూ ముందుకు వెళ్ళటం అభినందనీయం అన్నారు. రాష్ట్రంలోని ఇతర పాలకమండళ్ళ ప్రమాణ స్వీకారానికి ఆయా ప్రాంతాల్లో ఎంఎల్ఏలు అసంతృప్తితో దుమ్మాకొట్టగా శ్రీకాళహస్తిలో మాత్రం సుధీర్‌రెడ్డి అంతాతానై వ్యవహరించటం అభినందనీయం అని మంత్రి మనోహర్ అభినందించారు.

## భక్తుల మనోభావవాలను గౌరవిద్దాం:ఆలయాభివృద్ధికి పని చేద్దాం

**శ్రీకాళహస్తి,అక్టోబర్ 26 ప్రభాతవార్త**

శ్రీకాళహస్తి ధర్మకర్తల మండలి మొదటి సమావేశం ఆదివారం శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సభ్యులు చైర్మెన్‌గా కొట్టె సాయిప్రసాద్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భం గా శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీకాళహస్తీశ్వరాలయం రాష్ట్రంలో పెద్ద దేవాలయాల్లో ఒకటిగా ఉందన్నారు. ఇక్కడకు నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారు. అలాగే సామాన్య భక్తులు వస్తుం టారు. కాబట్టి అందరి మనోభావాలకు అనుగుణంగా పరిపాలనలో ముందుకు సాగాలన్నారు. ఆలయంలో నెల నెలా ఒక ఉత్సవం జరుగుతుంటుందని మనం సేవకులమనే భావన విస్మరించరాదన్నారు. వచ్చిన ప్రతి భక్తుని సుదర్శనం, సత్వర దర్శనంతో పాటు సదుపాయాల కల్పనకు మనం ప్రభుత్వం నుంచి అనుమతులు సాదించాలన్నారు. ప్రతి నెల సమావేశాలు జరపాలని పరిపాలనకు సంబంధించి సమీక్షించుకుంటూ ముందుకు సాగాలని ఎంఎల్ఏ సభ్యులకు సూచించారు. మిత్రుడు సాయి తనకు ఎంతో ముఖ్యుడని ఆయనకు పదవి రావటం హర్షణీయం అన్నారు. ప్రస్తుతం ఆలయంలో కార్తీక మాసం జరుగుతుంది. మనం భక్తులకు జవాబుదారి అని వారికి సేవలందించుటకే శివయ్య అవకాశం కల్పించాడనే దృష్టితో ముందుకు వెళ్ళాలన్నారు. అధికారులతో సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. అంతేకాక ఎప్పటి కప్పుడు తన దృష్టికి కూడా సమస్యలుంటే తీసుకురావాలని సూచించారు.ఈ సందర్భంగా నూతనంగా నియమించిన సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఇఒ డి.బాపిరెడ్డి సభ్యులకు పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ చైర్మెన్‌గా ఎన్నుకోబడిన కొట్టె సాయి ప్రసాద్‌ను దుశ్శాలువతో సత్కరించారు.

## ఆధ్యాత్మిక చింతనతో ముందుకు వెళ్ళండి: ఎస్‌సివి

**శ్రీకాళహస్తి,అక్టోబర్ 26 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయం పరమ పవిత్ర పుణ్యక్షేత్రమని ఇక్కడ ఆధ్యాత్మిక చింతనకు ప్రాధాన్యత ఇవ్వాలని మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు

చైర్మెన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన కొట్టె సాయిప్రసాద్‌కు సూచించారు. ఎస్‌సివి నాయుడు ప్రమాణ స్వీకారానికి హాజరయ్యారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదేండ్ల మనోహర్ రాగా ఆయనకునాయుడు స్వాగతం పలికారు. పాత జ్ఞాపకాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌సివి నాయుడు తన సహాచరులతో ప్రమాణ స్వీకారానికి హాజరై సభ్యులను ఆశీర్వదించారు. సూచనలు చేస్తూ రాష్ట్రంలోని పెద్ద దేవాలయాల్లో శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఎంతో పేరు ఉందన్నారు.ఇక్కడకు వచ్చే అతిథులతో పాటు సామాన్యభక్తుల మనోభావాలకు గుర్తింపు ఇవ్వాలన్నారు. ఆలయంలో సంప్రదాయం,సంస్కృతిని కాపాడుతూ మీరు మంచిపేరు తెచ్చుకోవాలని అలాగే ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని ఎస్‌సివి నాయుడు ఆశీర్వదించారు.

## పోలీస్ పిజిఆర్ఎస్ నేడు రద్దు

**తిరుపతి,అక్టోబర్ 26ప్రభాతవార్త:**

వాతావరణశాఖ హెచ్చరికలతో పరిస్థితులు ప్రతికూలంగా ఉండటంతో సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జరగాల్సిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దయ్యింది. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ప్రజల సౌకర్యార్థం నేటి కార్యక్రమం రద్దయ్యిందని తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు.

## మొంథా తుఫాను పట్ల అప్రమత్తంగా ఉండండి : తహసీల్దార్

**సత్యవేడు, అక్టోబరు 26 ప్రభాతవార్త:**

మొంథా తుఫాను పట్ల మండల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సత్యవేడు తహసీల్దార్ రాజశేఖర్ కోరారు. ఆదివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో రానున్న మొంథా తుఫాను ప్రభావంతో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై ఆయన మండల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాజశేఖర్ మాట్లాడుతూ రానున్న నాలుగైదు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవనున్న నేపథ్యంలో అధికారులందరూ సమన్వయంతో విధులు నిర్వర్తించాలన్నారు. అన్ని శాఖల అధికారులు తప్పని సరిగా మండల కేంద్రంలో అందుబాటులో ఉండాలని ఆయన సూచించారు. ఈ నెల 27,28,29 తేదీలలో ఇది మరింత తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు తలెత్తే పరిస్థితులపై ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. చెరువుల నీటి నిల్వలు, తూముల పరిస్థితిని క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తూ తదనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను కోరారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో షణ్ముగం, పరిపాలన అధికారి త్రివిక్రమరావు, పీఆర్ ఏఈ ఇబ్రహీంఖాన్, రెండో ఎంఈవో ఉష, మండల వ్యవసాయ అధికారి మురళి, ఇరుగుళం పశు వైద్యాధికారి దయాకర్, విద్యుత్ లైన్‌మెన్ మురగయ్య తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణముఖి వాగులో మునిగి రైతు మృతి...

**రేణిగుంట అక్టోబర్ 26 ప్రభాతవార్త**

రేణిగుంట మండలం తండ్లం ఎస్సీ కాలనీ సమీపంలో స్వర్ణముఖి నదిలో మునిగిపోయి ఆదినారాయణ (50) మృతి చెందిన సంఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగుచూచింది. వివరాల్లోకి వెళితే పుత్తూరు మండలం ఈసలాపురం కు చెందిన ఆదినారాయణ గత మూడు నెలలుగా రేణిగుంట మండలం తండ్లం ఎస్సీ కాలనీలో కాపురం ఉంటున్నాడు. ఇతనికి స్వర్ణముఖి నది అవతల పొలం ఉంది. బుధవారం స్వర్ణముఖి నది దాటుకొని పొలం వద్దకు వెళ్లాడు. బుధవారం కురిసిన వర్షానికి నది నీటిమట్టం పెరిగింది. ఈ విషయం తెలియని అతను తిరిగి ఇంటికి గురువారం రావడానికి నదిలో దిగాడు. నదిలో లోతైన గుంట ఉండటంతో అందులో మునిగిపోయాడు. అతను కనపడటం లేదంటూ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు గాజులమండ్యం పోలీసులు మిస్సింగ్ కేస్ నమోదు చేశారు. అయితే ఎవరో స్థానికులు అతను స్వర్ణముఖి నదిలో గల్లంతయ్యాడని శనివారం పోలీసులకు తెలిపారు. వెంటనే పోలీసులు సంఘటనా స్థలం చేరుకొని మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టారు. గుంతలో చిక్కుకుపోయిన అతని మృతదేహాన్ని ఆదివారం పోలీసులు వెలికి తీశారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు.

## మొంథా తుఫాను ముంచుకొస్తుంది అప్రమత్తంగా ఉండండి

**విజయపురం, అక్టోబరు 26 ప్రభాతవార్త:**

మొంథా తుఫాను ముంచుకొస్తుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కిరణ్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ లో తట్టు ప్రాంతాల్లో నివాసం ఉండేవారు సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని సూ చించారు. అత్యవసరం అయితే తప్ప బయటకు ఎవరూ వెళ్ళకూడదని సూచిం చారు. చెరువుల్లో, గుంటల్లో సరదా కోసం ఈత కొట్టడానికి వెళ్ళకూడదని సూ చించారు. ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు, పంచాయతీ కేం ద్రాల్లోమూడురోజుల పాటు అందుబాటులో ఉండాలని సూచించారు.అత్యవసర పరిస్థితిలో కంట్రోల్ రూం ఫోన్ నెం.9491077037ను సంప్రదించాలని కోరారు.

## ఎంపి అంబికా లక్ష్మినారాయణని కలిసిన

**తిరుపతి హెల్త్, అక్టోబర్ 26, ప్రభాతవార్త** అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మినారాయణని కలిసి ఈనెల 12వ తేది విజయవాడలో ఓబీసీ సెమినార్‌లో చర్చల గురించి వివరించారు. ఎంపీ ఓబీసీల డిమాండ్లు గూర్చి తెలుసుకొని అదే విధంగా తాను కూడా ఓబీసీ పార్లమెంటరీ నందు 20 మంది ఎంపీల బృందంలో తాను ఒక్కడిని తెలియజేశారు. సౌత్ ఇండియా ఓబిసి

అధ్యక్షుడిగా జబ్బల శ్రీనివాసులు ఎన్నికైనందుకు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ హౌస్‌లో ఓబీసీలకి చట్టసభలో, అదే విధంగా మహిళ 33 శాతం రిజర్వేషన్లు బీసీ మహిళలకు సబ్ కోటా కింద 50 రిజర్వేషన్ గురించి చర్చించడం, భవిష్యత్తులో ఓబీసీలకు హక్కులు కోసం తాను సంపూర్ణంగా సహకరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజా, సోము, లింగమూర్తి, గొట్టూరు అనిల్, చిరుతల విటల్ గౌడ్, ఇతర ఓబిసి మిత్రులు పాల్గొన్నారు.

## వేదమంత్రసారమే సంకీర్తనల తత్వం

***తిరుపతి కలెక్టరేట్, అక్టోబర్ 26 ప్రభాతవార్త :*** వేదమంత్ర సారాన్ని సంకీర్తనలుగా మలచి వాగ్గేయకారులు మనకందించారని పరిహార సేవా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బి. చక్రపాణి పేర్కొన్నారు.విశ్వామిత్ర సర్వీస్ సొసైటీ, ఆర్ట్ ఆఫ్ హ్యూమానిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన నామ సంకీర్తన వైభవం భక్తి సంగీత కార్యక్రమంలో ఆయన గౌరవ అతిథిగా పాల్గొన్నారు. కేటీ రోడ్ ఎన్ జి ఓ కాలనీ లోని అరవింద సొసైటీలో జరిగిన ఈ కార్యక్రమంలో రామస్వామి రఘుపతి,నిర్మల, హేమలత, హరిచందన పలు సంకీర్తనలను గానం చేసి శ్రోతల్లో భక్తి భావాన్ని నింపారు. భజరే భజరే, కలియుగాన వైకుంఠం, అదివో అల్లదివో, నీకే తెలియకపోతే, చక్కని తల్లికి చాంగుభళా వంటి సంకీర్తనలను రస రమ్యంగా ఆలపించి ఎంతగానో అలరించారు. ఈ కచేరీకి కీబోర్డ్ పై చల్లా యుగంధర్,తబలాపై డి. లోకయ్య నాయుడు అనువైన వాద్య సహకారం అందించారు. ప్రముఖ రంగస్థల నటుడు బొండు రామచంద్రారెడ్డి, ఘంటసాల గాన కళాపీఠం అధ్యక్షుడు మల్లం విజయకు మార్ రెడ్డి, ఉపాధ్యాయిని కోవూరు సుధ ఆత్మీయ అతిథులుగా పాల్గొని సంస్థ పక్షాన కళాకారులను ఘనంగా సత్కరించి అభినందించారు.సొసైటీ వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ కే సుబ్రహ్మణ్యం, ప్రముఖ గాయకుడు నాయని మధు, బిజెపి నాయకుడు సీఎం శరవణ, సంగీతాభిమానులు పాల్గొన్నారు.

## లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : తహసీల్దార్

***కేవీబీ పురం, అక్టోబరు 26 ప్రభాతవార్త:*** లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రోశయ్య, ఎంపీడీవో మాలతిలు పేర్కొన్నారు. ఆదివారం మొథా తుఫాను ప్రభావంతో తిరుపతి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక కార్యాలయంలో మండల విద్యుత్‌శాఖ, ఇరిగేషన్‌శాఖ, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ, పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా వీఆర్‌వోలు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శుల ద్వారా గ్రామాల్లో తుఫాను ప్రభావిత సంఘటన జరగకుండా తక్షణం మండల కేంద్రానికి సమాచారం అందించాలని, ఇబ్బందులు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో మాలతి తెలిపారు. ప్రజలు 27,28 తేదీల్లో అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఎవరూ కూడా లోతట్టు ప్రాంతంలో ఉండే ప్రజలు కాలువ ల్లో, చెరువుల్లోదిగరాదనివారుకోరారు.సమావేశంలోరెవెన్యూ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## పిజిఆర్ఎస్ రద్దు: కలెక్టర్

**తిరుపతి కలెక్టరేట్, అక్టోబర్,26 ప్రభాతవార్త:**

"మొంథా" తుఫాను కారణంగా జిల్లా వ్యాప్తంగా సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం (పిజిఆర్ఎస్) రద్దు పరచడం జరిగిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు "మొంథా" తుఫాను కార ణంగా సహాయకచర్యలలో ఉన్నందువలన ప్రజలెవ్వరికీ ఇబ్బంది కలగకుండా ఉండేందుకు గాను సోమవారం నాటి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా రద్దు చేశామన్నారు. ఈ అంశాన్ని ప్రజలందరూ గమనించి జిల్లా, రెవెన్యు, మండల కేంద్రాలకు వెళ్లరాదని ఆయన తెలిపారు.

## ఘనంగా నాగాలమ్మకు ప్రత్యేక పూజలు

**పుత్తూరు రూరల్, అక్టోబరు 26 ప్రభాతవార్త:**

పుత్తూరు పట్టణంలోని రైల్వే కొటర్స్ వద్ద ఉన్న నాగాలమ్మ దేవాలయంలో నాగాల చవితి పండుగ సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. అనంతరం దాతలు శ్రీకాంత్, జయశ్రీ ఆధ్వ ర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి విజయబాబు అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో ధనపాల్, ఎబ్బూరు సూరి, కిషోర్, మనోహర్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించని 13 ప్రైవేట్ బస్సులు స్వాధీనం

**తిరుపతిరవాణ,అక్టోబర్ 26ప్రభాతవార్త:**

ప్రయాణీకులను సురక్షితంగా గమ్యస్థానాలు చేర్చేలా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు సామర్థ్యం, అగ్నిప్రమాదాల బారినుండి కాపాడేపరికరాలు , ఎఫ్‌సి వంటివాటిపై తిరుపతి జిల్లా రవాణాశాఖ, పోలీసు అధికారులు ఆదివారం ఉదయం దాడులు చేశారు. ఉదయం తిరుపతి జిల్లావ్యాప్తంగా చేపట్టిన ఈ దాడుల్లో నిబంధనలు పాటించని,కనీస భద్రత చర్యలు తీసుకోని13 ప్రైవేట్ బస్సులను స్వాధీనంచేసుకున్నారు. నిబంధనలు, ఇతరత్రా రవాణాశాఖ నిబంధనలు లేని 27 బస్సులపై కేసులు నమోదు చేసినట్లు తిరుపతి జిల్లా రవాణాఅధికారి కొర్రపాటి మురళీమోహన్ తెలిపారు. బస్సులను మంచి సామర్థ్యంతో, అన్ని రకాలుగా సురక్షిత ప్రయాణంగా నడపాలని ఆయన ఆదేశించారు. ఈ తనిఖీల్లో తిరుపతి అదనపు ఎస్పీ రవిమనోహరచారి, డిఎస్పీ భక్తవత్సలం, ట్రాఫిక్ డిఎస్పీ రామకృష్ణమ ఆచారి,ఎంవిఐలు శ్రీనివాసరావు, మోహన్‌కుమార్, ఆంజనేయవర్మ పాల్గొన్నారు. సీజ్‌చేసిన బస్సులను మంగళం ఆర్టీసి డిపోకు తరలించారు.

# తిరుపతి డివిజన్

## 100 కోట్ల అభివృద్ధి కంటికి కనిపించలేదా ?

***పుత్తూరు (నగరి), అక్టోబరు 26 ప్రభాతవార్త :***

కూటమి ప్రభుత్వం అధి కారంలోకి వచ్చిన తర్వాత ఇ ప్పటి వరకూ ఎమ్మెల్యే గాలి భాను ప్రకాశ్‌నాయకత్వంలో నగరి నియో జకవర్గంలో జరుగుతున్న వంద కోట్ల అభివృద్ధి పనులు కంటికి కని పించలేదా అని వైసిపికి చెందిన మాజీ మంత్రి ఆర్.కె.రోజాను నగరి టిడిపి నాయకులు ప్రశ్నించారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు గుణశేఖర్‌నాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. నియోజకవర్గంలోని పుత్తూరు, నగరి మునిసిపాలిటీలు, అయిదు మండలాల్లో సిమెంట్ రోడ్లు, కాల్వలు వంటి మౌలిక సదుపాయాల కల్పన వంద కోట్లతో జరుగుతోందని తెలిపారు. ఎమ్మెల్యే అయిన కేవలం 15 నెలల కాలంలో నియోజకవర్గంలో రాజకీయాలకు అతీతంగా 650 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద నగదు చెక్కులు అందించారని తెలిపారు. ఏ ఒక్క తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలైనా అడ్డదారిలో మట్టి, గ్రావెల్ రవాణా చేయడం లేదని స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమాన్ని ఏకకాలంలో అమలు చేస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాశ్‌ను అనవసరంగా విమర్శించడం మాజీ మంత్రికి తగదని హితవు పలికారు. సమావేశంలో పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా అధికార ప్రతినిధి జ్యోతినాయుడు, నాయకులు బాలాజీ, కృష్ణారెడ్డి, కె.ఆర్.మణి, వెంకటరత్నం, ఆకుల శ్రీధర్, అశోక్, మనోహర్, గోపి, నారాయణస్వామి, మునిరత్నం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## మొంథా తుఫాను పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలి

***బుచ్చినాయుడు కండ్రిగ, అక్టోబరు 26 ప్రభాతవార్త:*** మొంథా తుఫాను పట్ల మండల అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో వెంకటరత్నమ్మ ఆదివారం ఎంపీడీవో కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. మొంథా తుఫాను ప్రభావంతో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై ఆయన మండల

శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించి సూచనలు జాగ్రత్తల గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ 27,28,29 తేదీలలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందు వలన అన్ని శాఖల అధికారులు తప్పని సరిగా మండల కేంద్రంలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు తలెత్తే పరిస్థితులపై ముం దస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే చెరువుల నీటి నిల్వలు, తూముల పరిస్థితిని క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తూ తదనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను కోరారు. అనంతరం గ్రామంలో కంట్రోల్ రూమును పరిశీలించి ఏర్పాటు చేశారు. సమావేశంలో ఎంపీడీవో శాఖ అధికారులు, రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## తుఫాను ప్రభావంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

**బుచ్చినాయుడు కండ్రిగ, అక్టోబరు 26 ప్రభాతవార్త:**

తుఫాను ప్రభావం వల్ల నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందించాలని సీపీఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ అన్నదాతలు వరి నాట్లు, ఏలిదిపైర్లు వానకు ముందు సాగు చేయడం జరిగింది. ఇటీవల కురిసిన తుఫాను ప్రభావం వలన నీట మునిగి కుళ్లిపోయాయి. నీటిప్రవాహం వలన పంట పొలాలు గండ్లు పడి ఇసుక దెబ్బతలు ఏర్పడ్డాయి. కూరగాయల పంటలు కూడా పూర్తి స్థాయిలో దెబ్బతిన్నాయి. మొంథా తుఫాను

# గూడూరు డివిజన్

## స్వర్ణముఖి పొర్లుకట్టలను పరిశీలించిన కలెక్టర్

కోట, అక్టోబర్ 26 ప్రభాతవార్త: కోట మండలం పుచ్చలపల్లి పంచాయతీలోని దెయ్యాలదిబ్బ వద్ద స్వర్ణముఖి నది పొర్లు కట్టలను ఆదివారం జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పరిశీలించారు. జనవరి నెలలో శాశ్వత పరిష్కారం దిశగా పనులు చేపడతామని కలెక్టర్ తెలిపారు. గ్రామస్థులు తాత్కాలిక పనులు కాకుండా రివిట్‌మెంట్ వంటి శాశ్వత పనులు చేయాలని విజ్ఞప్తి చేశారు. వర్షాలు తగ్గిన తర్వాత ఆ దిశగా పనులు చేపడతామని కలెక్టర్ చెప్పారు. ఈ ప్రాంత ప్రజలు గ్రామాలను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని కలెక్టర్ కోరారు. కలెక్టర్ వెంట పుచ్చలపల్లి జలసంఘం మాజీ అధ్యక్షులు దువ్వూరు వెంకట రమణారెడ్డి, ముత్యాలమ్మ ఆలయ కమిటీ ఛైర్మన్ దువ్వూరు దశరధరామిరెడ్డి, ఇన్‌ఛార్జ్ ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## తెగిన పొర్లు కట్టలను పరిశీలించిన కలెక్టర్

వాకాడు, అక్టోబర్ 26 ప్రభాతవార్త: వాకాడు మండలం బాలిరెడ్డిపాలెం గ్రామంలోని ఆదివారం స్వర్ణముఖి నదికి తెగిన పొర్లు కట్టలను, బాలి రెడ్డిపాలెం నుండి గంగన్న పాలెం మధ్య కాజ్‌వే జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు పరిశీలించారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ సంబంధించిన ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతూ లోతట్టు వేరేలో ఉన్న ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మొంతా తుఫాను ప్రభావంతో రాబోయే రెండు మూడు అధికారం యంత్రాగమంతా అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే అన్ని చర్యలు తీసుకోవాలని అధికార యంత్రంగానే హెచ్చరించారు.

## వాకాడు బ్యారేజీని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

వాకాడు, అక్టోబర్ 26 ప్రభాతవార్త: మండల కేంద్రమైన వాకాడు బ్యారేజి కం బ్రిడ్జిని ఆదివారం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ పరిశీలించారు. సంబంధించిన ఇరిగేషన్ అధికారుల ద్వారా బ్యారేజ్‌కి సంబంధించి వివరాలు అడిగి తెలుసు కున్నారు. బ్యారేజీలో నీటి మట్టం ఎంతవరకు ఉండాలో ఉంచాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. తుఫాన్ సమయంలో వరద నీరు ఎక్కువైనప్పుడు బ్యారేజ్ గేట్లు ను తెరవాలని సూచించారు. ఆయన వెంట ఇరిగేషన్ సూపర్డెంట్ ఇంజనీర్ రాధా కృష్ణమూర్తి, డిఈ ఆనంద్ బాబు, బ్యారేజ్ ఏఈ శ్రీనివాసులు, కృష్ణయ్య, నాయకులు, శాఖల అధికారులు ఉన్నారు.

## రైతులందరికి పర్మిట్లు మంజూరు

డక్కిలి,అక్టోబరు 26 ప్రభాతవార్త: డక్కిలి మండలంలో యూరియా కొరత లేకుండా రైతులకు పర్మిట్లు మంజూరు చేస్తున్నామని వ్యవసాయశాఖ అధికారిణి శిరీషా తెలిపారు. స్థానిక వ్యవసాయకార్యలయంలో ఆదివారం ఆమె రైతులకు యూరియా కార్డులు పంపణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న వ్యవసాయ సీజన్‌లో రైతులు యూరియా కోసం అవస్థలు ఎదుర్కోకుండా ముందుస్తుగా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు కార్డులు పంపిణీ చేస్తున్నామని వివరించారు.ఒక్కో ఎకరం పొలంకు మూడు దఫాలుగా మూడు బస్తాలు యూరియా ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ఇంకా ఎవ్వరైనా రైతులు తీసుకోకుండా ఉంటే వారు స్థానికంగా ఉండే అధికారులను సంప్రదించి తగు రికార్డులతో పర్మిట్లు తీసుకోవాలని తెలియజేశారు.

## ముంపు గ్రామాలను కాపాడండి : దువ్వూరు

కోట, అక్టోబర్ 26 ప్రభాతవార్త: భారీ వర్షాలు, వరదల కారణంగా స్వర్ణముఖి పొర్లుకట్టలు బలహీనంగా ఉన్నా యని, ఏ మాత్రం వరద ప్రవాహం ఎక్కువైనా కట్టలు తెగి పోయి అల్లంపాడు, చీకళ్లదిబ్బ, ఉత్తమ నెల్లూరు, దెయ్యా లదిబ్బ, దొరువుకట్ట గ్రామాలు మునిగిపోతాయని పుచ్చల పల్లి జలసంఘం మాజీ అధ్యక్షులు దువ్వూరు వెంకట రమణారెడ్డి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు తెలిపారు. ముంథా తుపాను నేపథ్యంలో ఆదివారం కలెక్టర్ వెంకటేశ్వర్ మండలం దెయ్యాలదిబ్బ గ్రామానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ముంపునకు గురయ్యే ఐదు గ్రామాలను కాపాడాలని దువ్వూరు వెంకట రమణారెడ్డి కలెక్టర్‌ను కోరారు. ఆయన వెంట ఇన్‌ఛార్జ్ ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డి, ముత్యాలమ్మ ఆలయ కమిటీ ఛైర్మన్ చిల్లకూరు దశరధరామిరెడ్డి, ట్రైనీ కలెక్టర్ సందీప్, సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, అల్లంపాడు మాజీ సర్పంచ్ రాజారామిరెడ్డి, ఉప సర్పంచ్ దేవరాల రాంబాబు, నీటిపారుదల శాఖ అధికారులు ఉన్నారు.

## టిడ్కో నివాసుల సమాచారం ఇవ్వాలి:ఎస్ఐ

గూడూరు, అక్టోబర్ 26 ప్రభాతవార్త: రూలర్ పరిధిలోని టిడ్కో హౌసింగ్ కాలనీలలో నివసిస్తున్న ప్రజలు తమ పూర్తి వివరాలు స్థానిక పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని ఎస్ఐ తిరుపతయ్య సూచించారు. ఎవరెవరు నివసిస్తున్నారు, ఎవరు ఇళ్లను బాడుగలకు ఇచ్చారో సమగ్ర సమాచారం అందించాలని పిలుపునిచ్చారు. టిడ్కో ఇళ్లలో సైబర్ క్రైమ్, బాల్య వివాహాలు చేసుకున్న వారికి షల్టర్ ఇవ్వడం అసాంఘిక కార్యక్రమాలు ఎవరు చేసినా స్థానిక పోలీసులకి సమాచారం ఇవ్వాలన్నారు. ఎలాంటి సమస్యలు వచ్చినా సంప్రదించమని తెలియజేశారు.

## అప్రమత్తంగా విధులు చేయాలి

డక్కిలి,అక్టోబరు 26 ప్రభాతవార్త: తుఫాన్ సమయాల్లో రెవెన్యూ సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని డక్కిలి తహశీల్దారు ఎం.శ్రీనివాసులు తెలిపారు.డక్కిలి తహశీల్దారు కార్యాలయంలో ఆదివారం ఆయన అత్యవసరంగా రెవిన్యూ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మెంథా తుఫాన్ ప్రభావంతో రానున్న 27,28,29 తేదిలల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న దృష్ట్యా సచివాలయాల్లోని సిబ్బంది గ్రామాలల్లో అందుబాటులో ఉండి విధులు భాద్యతగా నిర్వహించాలని సూచించారు. అన్నీ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి అత్యవసర పరిస్థిలు ఎర్పడినా తహశీల్దారు కార్యాలయంకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

## భక్తులు కోన మల్లేశ్వర కోనకు వెళ్ళరాదు: సిఐ

వెంకటగిరి, అక్టోబర్ 26 ప్రభాతవార్త: తుఫాను కారణంగా ప్రసిద్ధిగాంచిన కోలా మల్లేశ్వర కోనకు కార్తీక మాసం సందర్భంగా భక్తులు ఎవరు వెళ్లరాదని సిఐ ఏవి రమణ తెలిపారు. మూడు రోజులు పాటు తుఫాను ప్రభావం తీవ్రంగా ఉన్నందున వెలిగొండ అడవుల్లో ఉన్న కోన మల్లేశ్వర కోన జలపాతం వద్దకు వెళితే భక్తులు ఇబ్బంది పడతారని తెలిపారు. ఈ కోనకు వెళ్లాలంటే వాగులు వంకలు దాటాలని ఫలితంగా ప్రమాదాలు సంభవించవచ్చని తెలిపారు. భక్తులు గమనించి కోన మల్లేశ్వరి కానుక వెళ్లరాదని సూచించారు. భారీ వర్షం కారణంగా వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

## తుఫాను పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఎంపిడిఓ

గూడూరు, అక్టోబర్ 26 ప్రభాతవార్త: మొంథా తుఫాను పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గూడూరు ఎంపిడిఓ మధుసూదన్ రావు పేర్కొన్నారు. ఆదివారం గూడూరు పట్టణంలోని ఎంపిడిఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో తుపాన్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకి మొంథా తుఫాను ప్రభావం ఎక్కువ ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిందని, దీని వలన మన ప్రాంతంలో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాలలో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా గ్రామ కార్యదర్శులు చర్యలు చేపట్టాలని అన్నారు.

## టోల్ ప్లాజా వద్ద ఆర్టీవో...పోలీసుల తనిఖీలు

చిల్లకూరు, అక్టోబర్ 26 ప్రభాతవార్త: చిల్లకూరు మండలంలోని బూదనం టోల్ ప్లాజా వద్ద ఆర్టీవో కిషోర్ బాబు, ఆర్‌టిఏ కార్యాలయం అధికారులు, పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 9 ప్రైవేట్ బస్సులపై కేసులు నమోదు చేసి 56,800 రూపాయలు జరిమానా విధించారు. ఇది కార్యక్రమంలో గూడూరు ఆర్టీవో కిషోర్ బాబు, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ప్రభాకర్ శాంతి, సిబ్బంది మాట్లాడుతూ వాహనదారులు నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## గ్రామాలు మునిగిపోతాయి : పాదర్తి

కోట, అక్టోబర్ 26 ప్రభాతవార్త: మండలంలోని పుచ్చలపల్లి పంచాయతీలోని దెయ్యాలదిబ్బ, దొరువుకట్ట, పుచ్చలపల్లి తదితర గ్రామాల సమీపంలో స్వర్ణముఖి నది పొర్లుకట్టలు బలహీనంగా ఉన్నాయని, అధికారులు యుద్ధప్రాతి పదికన నివారణ చర్యలు చేపట్టకపోతే ముంపునకు గురవుతాయని వైసీపీ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ప్రధాన కార్యదర్శి పాదర్తి రాధాకృష్ణారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన ఆదివారం విలేఖరులతో మాట్లాడుతూ గతంలో పొర్లుకట్టలకు గండ్లు పడినా అధికారులు తాత్కాలికంగా పూడ్చారని చెప్పారు. ప్రతి సంవత్సరం భారీవర్షాలు, వరదలతో స్వర్ణముఖి పొర్లుకట్టలు తెగి రైతుల పొలాలు ఇసుక మేటలు వేస్తున్నాయని చెప్పారు. ప్రస్తుతం శాశ్వత పరిష్కారమైన రివిట్‌మెంట్ వాల్ నిర్మించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## ఆర్టీసీచే కార్తీక మాస ప్రత్యేక యాత్రలు

సూళ్లూరుపేట, అక్టోబర్ 26 ప్రభాతవార్త: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని సూళ్లూరుపేట ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆలయాల దర్శనాల కోసం సూపర్ లగ్జరీ బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ డి.కళ ఆదివారం తెలిపారు. 27వ తేదీ ఉదయం 6గంటల నుంచి ఈ బస్సులు ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయన్నారు. సూళ్లూరుపేటలో బయలుదేరి తిరున్నామలై చేరుకుని అక్కడి నుంచి వేలూరు గోల్డెన్ టెంపుల్, కాణిపాకం మీదుగా సూళ్లూరుపేటకు చేరుకుంటుందని ఆమె చెప్పారు. ప్రతి కార్తీక సోమవారం ఈ సదుపాయం ఉంటుందని ఆమె చెప్పారు. టిక్కెట్ ధర రూ.1275గా నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే 35 మంది ప్రయాణికులు గ్రూప్‌గా ఏ దేవాలయానికి వెళ్లాలన్నా బస్సు ఏర్పాటు చేయాలని కోరితే వారికి ప్రత్యేకంగా బస్సు ఏర్పాటు చేస్తామని డిపో మేనేజర్ తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పూరిల్లు దగ్ధం!

గూడూరు, అక్టోబర్ 26 ప్రభాతవార్త ? గూడూరు రూరల్ మండలం పోటుపాలెం గ్రామంలోని జోగి సుబ్బయ్య పెంచలయ్య అనే వ్యక్తి డయాలసిస్ చేయించు కుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఆయన నివాసం పోటుపాలెం గ్రామం లో హరిజనవాడ ఉన్న పూరి ఇల్లు ఆదివారం ప్రమాదం జరిగి కాలిపోయింది. ఈ విషయం తెలిసిన వెంటనే విఆర్ఓ రాధాకృష్ణ, విఆర్ఏ సంజీవ్ అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటల ఆర్పారు. ఇంట్లో ఉన్నా వస్తువులు, ఆధార్ కార్డ్‌లు, డబ్బులు సుమారు రెండు లక్షలు రూపాయిలు,బంగారు కమ్మలు మాటీలు కాలిపోయాయి. అందువల్ల బాధితుడికి ముగురు కుమార్తెలు కూడా ఉన్నారు. వాళ్ళ పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. వారికి సహాయం చేయవల్సిందిగా స్థానికులు కోరారు.

## వైసిపి ప్రభుత్వంలోనే కల్తీ మద్యం : పులికల్లు

వెంకటగిరి, అక్టోబర్ 26 ప్రభాతవార్త : గత వైసిపి ప్రభుత్వంలో విచ్చలవిడిగా కల్తీ మద్య విక్రయించారని మాజీ ఏఎంసీ చైర్మన్ పులికల్లు రాజేశ్వరరావు తెలిపారు. వెంకటగిరి పట్టణం క్రాస్ రోడ్డు వద్ద ఉన్న మద్యం షాపు వద్ద కూటమి ప్రభుత్వం విక్రయించే మద్యం నాణ్యమైనదని ప్రచారం చేశారు. కూటమి ప్రభుత్వంలో నాణ్యమైన మద్యం విక్రయిస్తున్నట్లు తెలిపారు. మద్యం సేవించేవారు ఆరోగ్యంగా ఉండాలని మంచి మద్యం విక్రయిస్తున్నట్లు చెప్పారు. క్యూఆర్ కోడ్ ద్వారా మద్యం తయారీ వివరాలు తెలుస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ విశ్వనాథం, పట్టణ పార్టీ అధ్యక్షుడు సత్య నారాయణ, రూరల్ మండల్ పార్టీ అధ్యక్షులు చంద్రమోళి రెడ్డి, డక్కిలి మండలం పార్టీ అధ్యక్షులు కోటేశ్వర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాసులు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## నేదురుమల్లి కుటుంబంతోనే అభివృద్ధి సాధ్యం:చిట్టేటి

వెంకటగిరి, అక్టోబర్ 26 ప్రభాతవార్త: నియోజకవర్గంలో నేదురుమల్లి కుటుంబం వారే ఎక్కువగా అభివృద్ధి చేశారని జిల్లా టెలికం సలహా మండలి సభ్యులు, వైసిపి మున్సిపల్ వింగ్ రాష్ట్ర కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ తెలిపారు. వెంకటగిరి లోని ఆయన పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం లోని నిర్వహించారు. తాను నేదురుమల్లి కుటుంబానికి నమ్మకంగా ఉన్నందువల్ల, పార్టీకి సేవ చేసినందున తనకు జిల్లా టెలికం సలహాలు సభ్యులు రామ్‌కుమార్‌రెడ్డి ఇప్పించారని తెలిపారు. ఈ సమావేశంలో వైసిపి మున్సిపల్ ఉపాధ్యక్షులు సతీష్, నాయకులు వెంకటేశ్వర్లు, అబూబకర్, పజిల్లా, తదితరులు పాల్గొన్నారు.

## నేడు కోటి సంతకాలు సేకరణ

వెంకటగిరి, అక్టోబర్ 26 ప్రభాతవార్త: రాష్ట్రంలో మెడికల్ కళాశాలలో ప్రైవేటు పరం చేస్తున్నందుకు నిరసనగా వెంకటగిరిలోని 8,14,24,25 వార్డులలో వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సోమవారం రచ్చబండ కార్యక్రమాలు నిర్వహిస్తారు. వార్డుల్లో ప్రజల నుండి ఆయన సంత కాలు సేకరిస్తారు. ఈ నెల మెడికల్ కళాశాలలో ప్రైవేట్ పరం చేస్తున్నందుకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నారు. కోటి సంతకాల కోసం పట్టణం గ్రామాల్లో విస్తృతంగా రామ్‌కుమార్‌రెడ్డి పర్యటిస్తారు.

## నాదెండ్లను కలిసిన కాపు సంఘం నేత కృష్ణయ్య

వెంకటగిరి, అక్టోబర్ 26 ప్రభాతవార్త : రాష్ట్ర సివిల్ సప్లై శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కాపు బలిజ సంక్షేమ సంఘం ట్రస్ట్ చైర్మన్ తోట కృష్ణయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం కమిటీ ప్రమాణ స్వీకారం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సివిల్‌సప్లైశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, హస్తకళ అభివృద్ధి చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్‌ను కూడా కలిశారు. ఈ కార్యక్రమానికి వెంకటగిరి నియోజకవర్గం నుండి తోట కృష్ణయ్య హాజరై వారిని అభినందించారు. రాపూర్ నుంచి జలీల్ రాజేష్, చెరుకు లోకేష్ స్వామి, వెంకటరమణయ్య, ఉమ్మడి చిత్తూరు జిల్లా కడప, నెల్లూరు జిల్లా నుంచి జనసైనికులు వీర మహిళలు నాయకులు కార్యకర్తలు హాజరయ్యారు.

## నేరాల నియంత్రణకే కార్డాన్ సెర్చ్ : సిఐ

గూడూరు, అక్టోబర్ 26 ప్రభాతవార్త: నేరాల నియంత్రణకే కార్డాన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని గూడూరు రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. గూడూరు రెండో పట్టణ పరిధిలోని ఆడవయ్య కాలనీ ప్రాంతంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్డన్ అండ్ సెర్చ్ సమయంలో వ్యక్తులను గుర్తించి, వారి వివరాలు సేకరించారన్నారు. అనుమానాస్పద వాహనాలను సరిచూసి,రికార్డులు లేని 11టూవీలర్లు, 3ఆటోలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

## సిఎం సహాయ నిధి చెక్కు పంపిణీ

గూడూరు, అక్టోబర్ 26 ప్రభాతవార్త: అనారోగ్యంతో బాధపడుతున్న రాం ప్రకాష్‌కు తిరుపతి స్విమ్స్ హాస్పిటల్ నందు చికిత్స కొరకు ముఖ్యమంత్రి సహాయ నిధిని ఆదివారం ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అందజేసారు. గూడూరు పట్టణం కర్ణాల వీధికి చెందిన రగుతు రాం ప్రకాష్‌కి ముఖ్యమంత్రి మంజూరు చేసిన 3,00,000 రూపాయల ఎల్ఓసిను వారి కుటుంబ సభ్యులకు అందించారు.

## సిపిఐ పట్టణ కార్యదర్శి మృతి బాధాకరం

గూడూరు, అక్టోబర్ 26 ప్రభాతవార్త: సీపీఐ పట్టణ కార్యదర్శి కాలేషా మృతి బాధాకరమని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జి.శశికుమార్ పేర్కొన్నారు. ఈయన మృతి పట్ల సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.హరినాథ్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, తిరుపతి సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్ సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి జి.శశికుమార్ మాట్లాడుతూ కామ్రేడ్ కాలేషా మృతి సీపీఐ పార్టీకి తీరని లోటు అన్నారు. ఈ కార్యక్రమంలో ఏ. ఐ.టి.యు.సి నియోజవర్గ అధ్యక్ష, కార్యదర్శులు సి.వి.ఆర్ కుమార్, నారాయణ, సీపీఐ చిల్లకూరు మండల కార్యదర్శి రమేష్, ఏఐవైఎఫ్ నాయకులు సి.హెచ్ వెంకటే శ్వర్లు, ఇన్సాఫ్ నాయకులు జమాల్‌లు, కాలేషా మృత దేహానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు.

## కుంటను తలపిస్తున్న రైల్వే అండర్ బ్రిడ్జి కింద నీళ్లు

పూతలపట్టు, అక్టోబర్ 26 ప్రభాతవార్త : పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైల్వే అండర్ బ్రిడ్జి కింద నీళ్లు పొంగిపొర్లుచున్నాయి రాకపోకలు నిలిచిపోయాయి పి. కొత్తకోట, పాకాల రహదారి నందు అమర్ రాజా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ 2000 మంది విధులకు ద్విచక్ర వాహనాలు షిఫ్ట్ డ్యూటీ వారిగా రాత్రి వేళలో వెళ్లాలన్న ద్విచక్ర వాహనదారులు వెళ్లాలన్న పొగ గొట్టంలోకి నీళ్లు వెళుతున్నాయి దీంతో భయందోళన గురవుతున్నారు. గతంలో ఉన్న పోటు కనుమ రైల్వే గేట్‌ను దక్షిణ మధ్య రైల్వే తీసివేసి అండర్ బ్రిడ్జిని నిర్మించడం జరిగినది. కాంట్రాక్టర్ వైఫల్యం కారణంగా సక్రమమైన ప్లాన్ ఆఫ్ యాక్షన్ లేకపోవడం వల్ల వర్షం పడితే నీరు బ్రిడ్జి కింద నీరు చెరువుల తలపించడం ప్రయాణికులకు సంకటంగా మారినది అటు అమర్ రాజా గ్రూప్ ఆఫ్ కంపెనీస్‌కి వెళ్లే ఉద్యోగుల పరిస్థితి, వారి వాహనాల పరిస్థితి దయానియంగా మారింది. అందులో పి కొత్తకోట పాకాలకు వెళ్ళుటకు బ్రిడ్జికి ఇరువైపులా రహదారి సూచికలు లేకపోవడం వలన రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు కూడా ఎక్కువగా చవి చూడటం జరుగుతున్నది. ఇకనైనా దక్షిణ మధ్య రైల్వే ఇంజనీరింగ్ అధికారులు రాష్ట్ర రోడ్డు రవాణా అధికారులు దీనిపై కలగజేసుకుని అటు ఉద్యోగుల సమస్యని ఇటు ప్రజల అసౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని మరమ్మతులు చేయవలసిందిగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైల్వే అండర్ బ్రిడ్జి కింద నీరు చెరువుల తలపించడం ప్రయాణికులకు నరకంగా మారింది.

## పోలీసు ఆయుధాలపై విద్యార్థులు అవగాహన : ఎస్పీ

చిత్తూరు, అక్టోబర్ 26 ప్రభాతవార్త: పోలీసులు తమ విధుల్లో ఉపయోగించే ఆయుధాలపై విద్యార్థులకు పూర్తి అవ గాహన కలిగి వుండాలని ఎస్పీ తుషార్ డూడి పేర్కొన్నారు. చిత్తూరు ఏఆర్ పోలీసు మైదానంలో ఆదివారం పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా ఓపెన్‌హౌస్‌ను ఎస్పీ తుషార్ డూడి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసులు వినియోగించే ఆయు ధాలు, పరికరాలు, సాధనాలను పోలీ సు అధికారులు ఓపెన్ హౌస్ కార్యక్రమంలో ప్రదర్శనకు వుంచారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో పోలీసు వ్యవస్థ పట్ల విశ్వాసం పెంపొందించడం, పోలీసుల కష్టసాధ్యమైన వధులకు సవరణ పొందేలా చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమంను నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు ఈ కార్యక్రమం ద్వారా పోలీసులు తమ నిత్యజీవితంలో ఎదుర్కొనే సవాళ్ళు, వారు ఉపయోగించే ఆయుధాలను నేరుగా చూడగలిగే అవకాశం వుంటుందన్నారు. పోలీసు దర్యాప్తుల్లో వహించే పాత్రను వివరించడంతో పాటు పోలీసు బలగాలు వినియోగించే ఆయుధాలు, వాటి వినియోగ పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఎఎస్పీ శివానందకిషోర్, చిత్తూరు డిఎస్పీ టి.సాయినాథ్, ఏఆర్ డిఎస్పీలు చిన్నికృష్ణ, మహబూబ్‌భాష, వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్, క్రైమ్ ఇన్స్‌పెక్టర్ ఉమా మహేశ్వర్, ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ లక్ష్మీనారాయణ, ఆర్ఐలు సుధాకర్, వీరేష్, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు అసోసియేషన్ ప్రెసిడెంట్ ఉదయ్‌కుమార్, ఏఆర్ పోలీసు సిబ్బందిలు పాల్గొన్నారు.

## రేణిగుంట నుండి బయలుదేరిన భారత్ గౌరవ ట్రైన్

రేణిగుంట అక్టోబర్ 26 ప్రభాతవార్త: రేణిగుంట రైల్వే స్టేషన్ నందు ఆదివారం ప్లాట్ ఫామ్ 4 నుండి సాయంత్రం 4:11 నిమిషాలకు 14 ఎల్ హెచ్ బి కోచులతో భారత్ గౌరవ ట్రైన్ లాంఛనంగా బయలుదేరింది. తిరుపతి స్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ, రేణిగుంట అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ రాజగోపాల్ రెడ్డి, ఐఆర్‌సిటిసి ఏరియా మేనేజర్ వేణుగోపాల్, రేణిగుంట స్టేషన్ మేనేజర్ శేషగిరి నాథ్, ఐఆర్‌సిటిసిఏఎస్సి మురళి, రేణిగుంట రైల్వే ప్రొడక్షన్ ఫోర్స్ ఎస్సైలు రమేష్, శ్రీనిష్ రైలు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని పచ్చ జెండా ఊపారు. ఈ రైలు నెల్లూరు, చీరాల, విజయవాడ, ఖమ్మం, కాజీపేట, సికింద్రాబాద్, నిజామాబాద్, నాందేడ్, మీదుగా అక్టోబర్ 31వ తేదీ 281 మంది ప్రయాణికులతో సబర్మతి జంక్షన్ చేరుకుంటుంది.

## ఆశీర్వాదానికి వెళ్ళి...తిరిగి రాని లోకాలకు!

తొట్టంబేడు,అక్టోబర్ 26 ప్రభాతవార్త: పెళ్ళి రోజు అత్తామామల ఆశీర్వాదం కోసం భార్యతో బయలుదేరి తిరిగి రాని లోకాలకు చేరుకున్న ఓ యువకుని విషాద సంఘటన తొట్టంబేడు మండలంలోని దిగువ కొణతనేరి దళిత వాడలో చోటు చేసుకుంది. దాంతో అక్కడ విషాదం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పులి గంగయ్య కుమారుడు పఉలి వెంకటేష్ తన పెళ్ళి రోజు సందర్భంగా సతీమణితో కలసి అత్తామామల ఆశీర్వాదం కోసం గుత్తి వారి పల్లికు బయలు దేరారు. ఆర్ మల్లవరం వద్ద రోడ్డు ప్రమాదం సంభవించి వెంకటేశ్ అక్కడికక్కడే మృతి చెందారు. ఆతని భార్య అపస్మారక స్థితిలో ఉండటంతో అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. రాష్ట్ర తెలుగుదేశం కార్యదర్శి గాలి చలపతి నాయుడు, మండల పార్టీ మాజీ అధ్యక్షులు గాలి మురళీనాయుడులు కుటుంబాన్ని ఓదార్చారు. మాజీ మండలాధ్యక్షురాలు కోవి ఎపోలమ్మ నివాళులర్పించారు. సంఘటన సమాచారం తెలుసుకున్న శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి, మండల పార్టీఅధ్యక్షుడు రావిళ్ళ మునిరాజానాయుడు చరవాణి ద్వారా సంతాపాలను తెలిపారు.

## ముగిసిన సుబ్రమణ్యస్వామి హోమం

తిరుపతి,అక్టోబర్ 26ప్రభాతవార్త: కపిలేశ్వర ఆలయంలో కార్తీకమాస పూజల్లో భాగంగా చేపట్టిన సుబ్రమణ్యేశ్వరస్వామి హోమం ఆదివారం ఉదయం పూర్తయింది. సోమవారం దక్షిణామూర్తిహోమం జరగనుంది. ఆదివారం ఈ హోమంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి దంపతులు, ఆలయ డిప్యూటీ ఇఒ నాగరత్న, ఆలయ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, అర్చకులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తీశ్వరాలయానికి...ప్రపంచ వ్యాప్త ప్రచారం:నాదేండ్ల

శ్రీకాళహస్తి,అక్టోబర్ 26 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయానికి ప్రపంచ వ్యాప్త ప్రచారం ఎంతో అవసరమని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదేండ్ల మనోహర్ అభిప్రాయపడ్డారు. శ్రీకాళహస్తీశ్వ రాలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్‌గా జనసేనకు చెందిన కొట్టె సాయిప్రసాద్ ఆదివారం ప్రమాణ స్వీకారోత్సవం చేశారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా వచ్